Email:prajamantalu@gmail.com
www.prajamantalu.com
# ప్రజా మంటలు
సంపుటి : 4 సంచిక : 159
పేజీలు - 8 వెల - రూ 5 : 00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు



## పదవీ భాద్యతలు స్వీకరించిన తుమ్మల



3లో..

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

# పదేండ్ల నిర్బంధం నుంచి తెలంగాణ విముక్తి

- వందరోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు
- ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేస్తాం
- ఆరునెలల్లోనే ఉద్యోగాల భర్తీకి చర్యలు
- మెగా డిఎస్సీతో టీచర్ పోస్టుల భర్తీ
- ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతాం
- శాఖలవారీగా శ్వేతపత్రాలు విడుదల చేస్తాం
- తొమ్మిదన్నరేళ్లలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారు
- అన్నివర్గాలకు సమన్యాయం చేసేలా పాలన
- గవర్నర్ ప్రసంగం ద్వారా ప్రభుత్వం వెల్లడి
- ఉభయ సభలను ఉద్దేశించి తమిళిసై ప్రసంగం



**హైదరాబాద్,డిసెంబర్15 :** పదేళ్ల నిర్బంధ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగిందని గవర్నర్ తమిళిసై అన్నారు. శుక్రవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రంగంలో దీనిని ప్రస్తావించారు. ప్రజాకవి కాళోజీ కవితతో గవర్నర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. మార్పు ఫలాలు ప్రజలకు చేరుతున్నాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తొందర్లోనే అమలు చేస్తామని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. దివాళా తీసిన తెలంగాణ ఆర్థిక వ్యవస్థను గాడి పెడుతూనే సంక్షేమ పథకాలను, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. అలాగే రాష్ట్రంలో ఏర్పడ్డ కొత్త ప్రభుత్వానికి గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ అభిందనలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరాలని కోరుతున్నా. ప్రజాసేవలో విజయం సాధించాలని కొత్త ప్రభుత్వాన్ని కోరుతున్నానని గవర్నర్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్వాహకంతో విద్యుత్ సంస్థలు రూ.81,516 కోట్లు అప్పుల్లో ఉందన్నారు. 50 వేల 275 కోట్ల నష్టంలో విద్యుత్ సంస్థ కొనసాగుతుందని... పౌరసరఫరాల శాఖ 56 వేల కోట్లు అప్పుల్లో ఉందన్నారు. దాడి తప్పిన ఆర్థిక వ్యవస్థపై తమ ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. త్వరలో శాఖల వారీగా శ్వేత పత్రం విడుదల చేయనున్నట్లు చెప్పారు. గడిచిన తొమ్మిదిన్నర ఏళ్ళల్లో చాలా సంస్థలు విధ్వంసానికి గురయ్యాయన్నారు. ప్రభుత్వ వ్యవస్థలు వ్యక్తుల కోసం పని చేసాయని తెలిపారు. కార్యనిర్వాహక వ్యవస్థలో విలువలను పునరుద్ధరిస్తా మని చెప్పారు. హైదరాబాద్‌లో ఇచ్చిన యువ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నామని గవర్నర్ ప్రసంగంలో చెప్పించింది ప్రభుత్వం. యువతకు తాము ఇచ్చిన ప్రతి మాట నెరవేరుస్తామన్నారు. మెగా డీఎస్సీ నిర్వహించి వచ్చే ఆరు నెలల్లో ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో నిరుద్యోగ యువత జీవితాలతో ఆడుకున్న టీఎస్పీఎస్సీ వ్యవస్థ ప్రక్షాళనకు ఇప్పటికే కార్యచరణ ప్రారంభించామని గవర్నర్ అన్నారు. ఏడాది లోపు రెండు లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీకి చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. ఏ పార్టీ ఎమ్మెల్యే అయినా తమ ప్రభుత్వం సమాన మిగతా 3లో..

## పార్లమెంట్ ఎన్నికల్లో మాది ఒంటరి పోరాటం



- సర్వేలకు అందని విధంగా లోక్‌సభ ఫలితాలు
- ఎవరితోనూ పొత్తులు లేవని తేల్చిన కిషన్ రెడ్డి
- ముఖ్య నేతలతో సమావేశంలో కీలక వ్యాఖ్యలు

## సిఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం

### తన కోసం ట్రాఫిక్ నిలిపివేయొద్దని ఆదేశం

**హైదరాబాద్,డిసెంబర్15 :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు.. తన కాన్వాయ్ కోసం ట్రాఫిక్‌ని ఆపవద్దంటూ పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తాను మామూలుగానే వెళతానని, తన కోసం ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని అన్నారు. తాను బయలుదేరడానికి చాలా సేపటి ముందు నుంచే ట్రాఫిక్ నిలిపివేయొద్దని పోలీసులకు సూచించారు. దీనివల్ల వాహనాదారులు చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని ఈ విషయంలో మినహాయింపులు కల్పించే ఆలోచన చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా తన కాన్వాయ్ వెళ్లేలా చూడాలన్నారు. సాధారణ ట్రాఫిక్‌లోని తన కాన్వాయ్‌ని అనుమతించాలని సీఎం ఆదేశించారు. ఇక కాన్వాయ్ కోసం కొత్త కార్లను కొనద్దని, ప్రస్తుతం ఉన్న తెల్లరంగు కార్లకు నలుపు రంగు వేసి వినియోగిం చాలని ఆదేశించారు. ట్రాఫిక్, శాంతిభద్రతల విభాగం పోలీసులు సీఎం సూచనలపై సమీక్షించి తగిన నిర్ణయం తీసుకోనున్నారు.

## దశదిశ లేకుండా గవర్నర్ ప్రసంగం

- ఆరు గ్యారెంటీలకు కానరాని ప్రణాళిక
- రూట్ మ్యాప్ లేకుండా కాంగ్రెస్ తీరు
- ఇప్పుడే తెలంగాణ విముక్తి అన్నట్లు చెప్పడం దారుణం
- గవర్నర్ ప్రసంగం అంతా అబద్ధాలమయం
- బిఆర్ఎస్ నేత కడియం శ్రీహరి పెదవివిరుపు



2లో..

## ఆస్పత్రి నుంచి కెసిఆర్ డిశ్చార్జ్

- నేరుగా నందినగర్ ఇంటికి చేరిక
- దిష్టితీసి ఇంట్లోకి తీసుకెళ్లిన కుటుంబ భ్యులు
- వెంట కెటిఆర్ తదిరులు
- కెసిఆర్ భద్రతను కుదించిన ప్రభుత్వం



2లో..

## మొన్నటి ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగలే

- ఎన్నికల్లో ఫలితాలు బిజెపిని నిరాశపరిచాయి
- గజ్వేల్ కార్యకర్త భేటీలో ఈటెల రాజేందర్



3లో..

## ఉమ్మడి వరంగల్ జిల్లా బిఆర్ఎస్‌లో మంటలు

- మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్‌లే విలన్లు
- మండిపడ్డ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి
- వారి వల్లనే పార్టీ భ్రష్టు పట్టిందని వ్యాఖ్య
- తన ఓటిమికి కారకులను వదిలేది లేదన్న శంకర్ నాయక్



2లో..

## ఫ్రాన్స్ ప్రతినిధులతో ఐటి మంత్రి శ్రీధర్ బాబు భేటీ

### హైదరాబాద్‌లో పెట్టుబడులకు ఆహ్వానం



**హైదరాబాద్,డిసెంబర్15 :** ఫ్రెంచ్ కంపెనీ మెరియో సిఇవో రెమి ప్లెనెట్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం శుక్రవారం పరిశ్రమలు, ఎ÷ు శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో భేటీ అయ్యారు. హైదరాబాద్‌కు చెందిన హెచ్‌సి రోబోటిక్స్ సౌజన్యంతో సాయుధ దళాల కోసం అధునాతన గింబాల్స్‌ను తయారు చేసేందుకు రూపొందించిన ప్రణాళికను ప్రతినిధి బృందం మంత్రికి వివరించారు. భారతదేశంలో మొట్టమొదటి సారిగా ఏర్పాటు చేయబోతున్న ప్రత్యేకమైన ప్రాజెక్టుకు అవసరమైన సహాయాన్ని అందిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. వారం రోజుల పాటు భారతదేశ పర్యటనకు వచ్చిన ఈ బృందం రక్షణ మంత్రిత్వ శాఖ, ఇతర రక్షణ సంస్థల ఉన్నతాధికారులను కలిసి వారి ప్రణాళికలను వివరించారు. ఎయిర్ ఫోర్స్ చీఫ్, వెస్ట్రన్ నేవల్ కమాండ్, ఇండియన్ కోస్ట్ గార్డ్ లను సందర్శించారు. హెచ్‌సి రోబోటిక్స్ బృందంలో సిఇవో వెంకట్ చుండి, డైరెక్టర్ డాక్టర్ రాధాకిషోర్ ఉన్నారు. ఫ్రెంచ్ బృందంలో మిస్టర్ మాథ్యూ డెస్పోర్స్, టెక్నికల్ మేనేజర్ ,నోయెమి లాన్సియన్, సేల్స్ మేనేజర్ ఉన్నారు.

## సిద్దిపేట జిల్లాలో దారుణం

- గన్‌తో భార్యా పిల్లలను కాల్చి తానూ ఆత్మహత్య
- కలెక్టర్ గన్‌మెన్ ఆకుల నరేశ్ దురాగతం
- ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు





**సిద్ధిపేట,డిసెంబర్15 :** సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రాముని పట్లలో శుక్రవారం దారుణం జరిగింది. కలెక్టర్ వద్ద గన్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి భార్యాపిల్లలను కాల్చి తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన స్థానికంగా కలకలం రేపింది. గన్‌మెన్ నరేశ్ తన భార్య, ఇద్దరు పిల్లలను చంపిన అనంతరం గన్‌తో తానూ కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్ధిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ వద్ద గన్ మెన్ గా పని చేస్తున్న ఆకుల నరేష్, తన భార్య చైతన్య, కుమారుడు రేవంత్, కుమార్తె హిమశ్రీతో కలిసి చిన్నకోడూర్‌లోని రామునిపట్లలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం నరేశ్ విధులకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉన్నాడు. తన వెంట తెచ్చుకున్న 9 ఎంఎం పిస్టల్ తో భార్య, పిల్లలను కాల్చేశాడు. అనంతరం తానూ కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విధులకు రాకపోవడంతో అనుమానం వచ్చిన సిబ్బంది ఇంటికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో ఉన్న నలుగురిని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాలను ఆస్పత్రికి తరలించారు. వీరి ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణమా.? లేక కుటుంబ కలహాలు కారణమా.? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అని పోలీసులు ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో స్థానికంగా విషాదం నెలకొంది. అయితే అప్పుల విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగినట్టు సమాచారం. ఈ గొడవల కారణంగా స్కూలుకు వెళ్లిన పిల్లలను ఇంటికి తీసుకువచ్చిన నరేష్.. ఆవేశంగా తన దగ్గర ఉన్న గన్‌ను తీసుకొని మొదటగా పిల్లలను కాల్చి తర్వాత భార్యను.. ఆపై తనకు తాను కాల్చుకుని మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## ప్రజానాడి



## వేసవి నీటి ఎద్దడి రాకుండా చర్యలు



### ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి

### అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు

**హైదరాబాద్,డిసెంబర్15 :** రానున్న వేసవికాలంలో నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ముందుగా నీటి ఎద్దడి గ్రామాలను గుర్తించి అందుకు తగ్గట్లుగా ప్రణాళిక ఉండాన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని తాగునీటి సరఫరా పరిస్థితిని ప్రతిరోజు నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు. మిషన్ భగీరథ శాఖ కార్యకలాపాల పై చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండెంట్ ఇంజనీర్లతో మంత్రి సీతక్క శుక్రవారం

## మరో తొమ్మిదిమంది ఐఎఎస్‌ల బదిలీ

**హైదరాబాద్,డిసెంబర్15 :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారుల బదిలీలను కొనసాగిస్తోంది. తాజాగా మరికొందరు ఐఎఎసలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు తమ శాఖలపై వరుస రివ్యూలు చేస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ యంత్రాంగం పరుగులు పెడుతోంది. అధికారుల బదిలీలు, పోస్టింగ్‌ల్లో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటోంది. పలువురు అధికారులను బదిలీ చేస్తోంది. శుక్రవారం 2021 బ్యాచ్ కు చెందిన తొమ్మిది మంది ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. బదిలీ అయిన వారికి పోస్టింగ్స్ ఇస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమరి ఉత్తర్వులు జారీ చేశారు.నిర్మల్ అడిషనల్ కలెక్టర్‌గా ఫైజాన్ అహ్మద్, హన్మకొండ అడిషనల్ కలెక్టర్‌గా రాధాగుప్త, ములుగు అడిషనల్ కలెక్టర్‌గా పి శ్రీజ, రాజన్న సిరిసిల్ల అడిషనల్ కలెక్టర్‌గా పి గౌతమి, జనగామ అడిషన్ కలెక్టర్‌గా పర్మార్ పింకేష్‌కుమార్ లలిత్‌కుమార్, మహబూబాబాద్ అదనపు కలెక్టర్‌గా లెనిన్ వత్సల్ టోప్పో, మహబూబ్‌నగర్ అడిషనల్ కలెక్టర్‌గా శివేంద్ర ప్రతాప్, వనపర్తి అదనపు కలెక్టర్‌గా సంచిత్ గంగ్వార్, జయశంకర్ భూపాలపల్లి అదనపు కలెక్టర్‌గా పి కధీరవన్ ను ప్రభుత్వం నియామించింది.

# దశదిశ లేకుండా గవర్నర్ ప్రసంగం

## బిఆర్ఎస్ నేత కడియం శ్రీహరి పెదవివిరుపు



**హైదరాబాద్,డిసెంబర్15 :** తెలంగాణ సాధించిన ప్రగతిని పక్కన పెట్టి గవర్నర్ ప్రసంగం చేశారని అందులో కొత్తదనం లేదని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలకు ఎటువంటి ప్రణాళిక గవర్నర్ ప్రసంగంలో లేదన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన రూట్ మ్యాప్ గవర్నర్ ప్రసంగంలో లేదు. అది ఉంటే బాగుండేదని, కానీ గవర్నర్ చేత ఈ రాష్ట్ర ప్రభుత్వం అన్ని అసత్యాలను చెప్పించిందని మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగం ముగిసిన అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో కడియం శ్రీహరి మాట్లాడారు. తోటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి ఎంచుకున్న మార్గం ఏమిటో చెప్పలేదన్నారు. అబద్దాలను చెప్పించడం తగదన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం అభివృద్ధికి ఎంచుకున్న మార్గమేమిటో, పంథా ఏమిటో అన్నది గవర్నర్ ప్రసంగంలో కానరాలేదన్నారు. గవర్నర్ ప్రసంగం అంతా కాంగ్రెస్ మేనిఫెస్టో చదివినట్టుగా ఉందన్నారు. పదేళ్లలో తెలంగాణ సాధించిన అభివృద్ధిని విస్మరించారని, తిరోగమన దిశలో తెలంగాణ ఉన్నట్టు చెప్పే ప్రయత్నం చేశారని కడియం అన్నారు. నీతి ఆయోగ్ ప్రశంసలు, కేంద్ర ప్రభుత్వ అవార్డులను విస్మరించారని, ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్ వన్, ఐటీ ఎగుమతుల్లో సాధించిన ప్రగతిని గవర్నర్ చెప్పడం మరచిపోయారని ఆయన అన్నారు. నిరంతర విద్యుత్‌ను ఎవరూ కాదనలేరని అన్నారు. తెలంగాణ నిర్బంధం నుంచి విముక్తి అయింది అని గవర్నర్ చెప్పడం సరికాదన్నారు. ఆమె స్థాయికి తగదన్నారు. గవర్నర్ అబద్దాలు చెప్పడం దురదృష్ట కరమని కడియం అన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించుకున్నారని, 2014 లోనే తెలంగాణ నిర్బంధం నుంచి విముక్తం అయ్యిందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఎలా అమలు చేస్తారో చెప్పలేదని, దళిత బంధు ప్రస్తావన లేదని, రైతుల పంటలకు బోనస్ గురించి మాట్లాడ లేదన్నారు. కాంగ్రెస్ హామీల నుంచి పలాయన వాదం పాటించేలా గవర్నర్ ప్రసంగం ఉందని ఆయన అన్నారు. గవర్నర్ గతంలో మాట్లాడింది, ఇప్పుడు మాట్లాడింది సమీక్ష చేసుకోవాలని కడియం సూచించారు. గవర్నర్ ప్రసంగం పూర్తిగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో చదివినట్లు ఉంది. గత పది సంవత్సరాలుగా తెలంగాణ తిరోగమనంలో ఉన్నట్లు గవర్నర్ ప్రసంగం ఉంది. కానీ జాతీయ స్థాయిలో అనేక తెలంగాణ అవార్డులు అందుకున్నది గవర్నర్ మరిచిపోయారు. హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను తలదన్ని తెలంగాణ వరి ఉత్పత్తిలో ముందు నిలిచింది. తలసరి ఆదాయం గణనీయంగా పెరిగింది నిజం కాదా? ఐటీ ఉత్పత్తులు, ఎగుమతుల్లో హైదరాబాద్ బ్రహ్మాండమైన అభివృద్ధి సాధించింది అని శ్రీహరి తెలిపారు. ప్రజలందరూ ఇప్పుడు సంతోషపడుతున్నట్లు మాట్లాడడం సరైంది కాదు. పది సంవత్సరాల కాలంలో తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ వాయువులు పీల్చారు. కానీ ఇప్పుడు తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ వాయువులు పిలుస్తున్నారని చెప్పడం సముచితం కాదు. తెలంగాణ నిర్బంధం నుంచి విముక్తి అయిందని గవర్నర్ చెప్పడం సరికాదు. గవర్నర్ అబద్దాలు చెప్పడం దురదృష్టకరం. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించుకున్నారు. 2014లోనే తెలంగాణ నిర్బంధం నుంచి విముక్తి అయింది. ఇప్పుడు కావడమేమిటి అని కడియం ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగంలో దళిత బంధు ప్రస్తావన లేదు. మద్దతు ధరకు రూ. 500 కలిపి ధాన్యం కొనుగోలు చేస్తామని అన్నారు. దానిపై గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావన లేదు. దీన్ని బట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా కనబడడం లేదు. ప్రభుత్వం విడుదల చేసే శ్వేత పత్రాలపై మా నుండి కూడా సరైన సమాధానం ఉంటుంది అని కడియం పేర్కొన్నారు. మీడియా సమావేశంలో కడియంతో పాటు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, మహేందర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల పేరుతో తప్పించుకునే యత్నం

## విద్యుత్ అప్పులపై అబద్దాలు చెప్పారు

## గవర్నర్ ప్రసంగంపై నిరంజన్ రెడ్డి విమర్శలు



**వనపర్తి,డిసెంబర్15 :** అప్పుల పేరుతో పథకాల నుంచి కాంగ్రెస్ తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని మాజీ రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. తొమ్మిదిన్నరేళ్ల పాలన మీద బురద చల్లే కంటే 6 గ్యారంటీల అమలు మీద కాంగ్రెస్ పార్టీ శ్రద్ధ వహిస్తే మంచిదని హితవుపలికారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగాన్ని నిరంజన్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. గవర్నర్ ప్రసంగంలా కాకుండా కాంగ్రెస్ మ్యానిఫెస్టోను చదువుతున్నట్లుగా ఉందిని అన్నారు. ఇదేనా కాంగ్రెస్ తీరు అని ప్రశ్నించారు. ఆర్థిక విధ్వంసం కాదు .. ఆర్థిక స్వాతంత్ర్యం తీసుకొచ్చామని అన్నారు. అబద్దాలు చెప్పడం వలన అభాసుపాలు కావడం తప్ప ఏమీ ఉండదన్నారు. విద్యుత్ శాఖలో రూ.86 వేల కోట్ల అప్పులను చూపడం హాస్యాస్పదమన్నారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు లోబడి అత్యంత తక్కువగా రుణాలు తీసుకున్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాకులు మాని ఇచ్చిన హామీలు ఎలా అమలు చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని బాగు చేయకున్నా నష్టం చేయకుంటే చాలన్నారు. మొత్తం గవర్నర్ ప్రసంగంలో తెలంగాణ ఈ పది సంవత్సరాలలో తిరోగమనంలో ఉంది అన్నట్లు చెప్పారని నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి ఉండదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తారో చెప్పాలన్నారు. వాటిపై దృష్టి పెడితే మంచిదన్నారు.

# నయాసాల్ కోసం నగర ప్రజల ఆసక్తి

## ఇప్పటి నుంచే ఏర్పాట్లలో యువత బిజీ

**హైదరాబాద్,డిసెంబర్15 :** నూతన సంవత్సర వేడుకలను ఎంజాయ్ చేసేందుకు జంటనగరాల ప్రజలు సిద్ధమవుతున్నారు. నయా సాల్ ముబారక్‌లో పాల్గొనేందుకు యువత మాత్రమే కాదు.. పెద్దలు సైతం సంబరాలను ఘనంగా నిర్వహించుకునేందుకు రెడీ అయ్యారు. అధిక శాతం మంది పబ్బులు, హోటళ్లు, రిసార్ట్‌లకు వెళ్లేందుకు ఇప్పటికే బుకింగ్‌లు పూర్తి చేసుకున్నారు. బంధువులు, స్నేహితులను ఆహ్వానించి ఇంట్లోనే సెలబ్రేట్ చేసుకునేలా మరికొందరు ప్లాన్ చేస్తున్నారు. డిసెంబరు 31కి వీడ్కోలు పలికి న్యూ జోష్‌ను నింపుకోవాలని ఎక్కువమంది భావిస్తున్నారు. పిల్లలు, యువత మాత్రమే కాదు పెద్దవారు సైతం వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇళ్లలో, అపార్ట్‌మెంట్లలో పెద్దఎత్తున వేడుకలు జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. లైటింగ్‌లు, డిజెలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా బంధువులు, స్నేహితులతో కలిసి విందు, వినోదాల్లో పాలుపంచుకోవడం చూస్తున్నాం. ఎక్కువ మంది వేడుకలను ఇంటి వద్దే చేసుకునేందుకు ఆసక్తి చూపారు. యువత మాత్రం పబ్బులు, ఇతర ప్రాంతాలకు వెళ్తామంటున్నారు. నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు అన్ని వర్గాల వారు ఆసక్తి చూపించారు. పెద్దగా స్థోమత లేనివారు. డిసెంబరు 31 రాత్రిని ఇంట్లోనే జరుపుకొనేందుకు ప్రాధాన్యమిస్తామంటున్నారు. స్నేహితులు, బంధువులను ఇంటికి ఆహ్వానిస్తామని ,పబ్‌లు, హోటళ్లకు వెళ్తామని చెబుతున్నారు. పబ్బుల్లో గతేడాదికంటే అధికంగా ధరలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ధరలు భారంగా ఉన్నా, ఏడాదికోసారి వచ్చే వేడుక కాబట్టి భరించక తప్పడం లేదన్నారు.ఎక్కువగా సంపన్నవర్గాలు ఉండే ప్రాంతాల్లో పబ్‌లు, హోటళ్లకు, రిసార్టులకు ప్రాధాన్యమిచ్చారు.

# పటేల్‌కు మోడీ నివాళి

**న్యూఢిల్లీ,డిసెంబర్15 :** భారత తొలి హోంశాఖ మంత్రి, స్వర్గీయ సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆయన సేవల్ని ప్రధాని నరేంద్ర మోదీ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళి అర్పించారు. 'బలమైన, ఐక్య దేశాన్ని నిర్మించడంలో పటేల్ కీలక పాత్ర పోషించారు. బ్రిటిషర్ల నుంచి స్వాతంత్య్రం వచ్చేలా కృషి చేశారు. దేశంలోని అనేక రాష్ట్రాలు రాచరికపాలనలో ఉన్నప్పుడు చాకచక్యతను ప్రదర్శించి భారత్ లో విలీనం చేశారు. ఆయన దార్శనిక నాయకత్వం, దేశ ఐక్యతపట్ల అచంచల నిబద్ధత ఆధునిక భారత్ నిర్మాణానికి పునాదులు వేసింది. ఆయన ఆదర్శవంతమైన జీవితం దేశ భవిష్యత్తుకు మార్గనిర్దేశర చేస్తుంది. పటేల్ కలల్ని సాకారం చేసేందుకు కృషి చేస్తాం' అని ట్విట్టర్‌లో తెలిపారు.

# పదవీ భాధ్యతలు స్వీకరించిన తుమ్మల

## హాజరైన మల్లు భట్టి విక్రమార్క తదితరులు



**హైదరాబాద్,డిసెంబర్15 :** రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్స్ శాఖా మంత్రిగా తుమ్మల నాగేశ్వర రావు బాధ్యతలు స్వీకరించారు. డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆయన భాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, డైరెక్టర్ గోపి, ఉద్యానవన శాఖ కమీషనర్ హనుమంత రావు, సత్య శారదలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరై మంత్రి కి శుభాకాంక్షలందచేశారు

# తెలంగాణలో ప్రజా ప్రతినిధులపై 115 కేసులు

## హైకోర్టుకు రిజిస్ట్రార్ నివేదిక



**హైదరాబాద్,డిసెంబర్15 :** తెలంగాణలో ప్రజాప్రతినిధులపై కేసుల వివరాలను హైకోర్టుకు రిజిస్టార్ నివేదిక అందజేసింది. ప్రస్తుతం తెలంగాణలో ప్రజా ప్రతినిధులపై 115 కేసులు ఉన్నాయని వెల్లడించింది. 20 కేసులు సీబీఐ కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది. 46 కేసులు ప్రజా ప్రతినిధులకు సమన్లు జారీ చేసే దశలో ఉన్నాయని వివరించింది. 10 కేసుల్లో ప్రజా ప్రతినిధుల కేసులపై స్టే ఉందని పేర్కొంది. కాగా ఈ రోజు (శుక్రవారం) నుంచి 2 నెలల లోపు విచారణ పూర్తి చేయాలని సీబీఐ కోర్టును హైకోర్ట్ ఆదేశించింది. సంబంధిత పోలీసులు 2 వారాల్లో సమన్లు జారీ చేయాలని హైకోర్ట్ ఆదేశించింది. స్టే పిటిషన్లపై ఉత్తర్వులు జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. 15 కేసులు ట్రయల్ దశలో ఉన్నాయని, వాటిని త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. 5 కేసుల్లో వెంటనే ప్రజా ప్రతినిధుల కేసులపై ఛార్జ్‌షీట్ నంబర్లు దాఖలు చేయాలని హైకోర్టు పేర్కొంది. మూడు నెలల లోపు పూర్తి వివరాలతో మరో రిపోర్ట్ సమర్పించాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది.

# వేసవి నీటి ఎద్దడి రాకుండా చర్యలు



సమావేశమయ్యారు. దాదాపు 3 గంటల పాటు సమగ్రంగా ఈ సమీక్షాసమావేశం జరిగింది. మిషన్ భగీరథ శాఖ కార్యకలాపాల గురించి ఆ శాఖ ముఖ్యకార్యదర్శి స్మితా సభర్వాల్ మంత్రికి సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్లు, నదులు తదితర నీటి వనరుల స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు మంత్రి సీతక్క సూచించారు. రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గినప్పుడల్లా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని.. ఇరిగేషన్ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. మేడారం జాతరపై త్వరలోనే లైన్ డిపార్ట్‌మెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తానని పేర్కొన్నారు.

# ఆస్పత్రి నుంచి కెసిఆర్ డిశ్చార్జ్

- నేరుగా నందినగర్ ఇంటికి చేరిక
- దిష్టితీసి ఇంట్లోకి తీసుకెళ్లిన కుటుంబ భ్యులు
- వెంటవచ్చిన కెటిఆర్ తదిరులు
- కెసిఆర్ భద్రతను కుదించిన ప్రభుత్వం



**హైదరాబాద్,డిసెంబర్15 :** బీఆర్ఎస్ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ యశోద ఆస్పత్రి నుంచి శుక్రవారం ఉదయం డిశ్చార్జ్ అయ్యారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన కేసీఆర్.. నేరుగా బంజారాహిల్స్ నంది నగర్‌లోని తన సొంతింటికి వెళ్లారు. ఆయనకు ఇంటివద్ద గుమ్మడికాయతో దిష్టితీసి ఇంట్లోకి తీసుకుని వెళ్లారు. కేసీఆర్ వెంట కేటీఆర్, హరీశ్‌రావు ఉన్నారు. హిప్ రిప్లేస్‌మెంట్ సర్జరీ కారణంగా కేసీఆర్ యశోద ఆస్పత్రిలో వారం రోజుల పాటు ఉన్నారు. చికిత్స అనంతరం కేసీఆర్ కోలుకోవడంతో.. వైద్యులు శుక్రవారం డిశ్చార్జ్ చేశారు. మరో నాలుగైదు వారాల పాటు కేసీఆర్ విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. 8వ తేదీన రాత్రి కేసీఆర్ తన వ్యవసాయ క్షేత్రంలో కాలు జారి కింద పడిన సంగతి తెలిసిందే. దీంతో కేసీఆర్‌ను కుటుంబ సభ్యులు సోమాజి గూడలోని యశోద ఆస్పత్రికి తరలించారు. 9వ తేదీన కేసీఆర్ హిప్ రిప్లేస్‌మెంట్ సర్జరీ నిర్వ హించారు. ఆ తర్వాత కేసీఆర్‌ను వాకర్ సాయంతో వైద్యులు నడిపిం చారు. తుంటి మార్పిడి విజయవంతం కావడం, మరుసటి రోజునే ఆయన వాకర్ సాయంతో నడవడం, ఆరోగ్యం కుదుటపడడంతో డిశ్చార్జి చేయాలని వైద్యులు నిర్ణయం తీసుకున్నారు. డిశ్చార్జి తర్వాత కేసీఆర్ హైదరాబాద్ నంది నగర్‌లోని తన పాత ఇంటికి వెళ్లారు. కేసీఆర్ డిశ్చార్జి అవుతారని తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు నందినగర్‌లోని పాత ఇంట్లో ఆయన ఉండడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. వైద్య సేవల కోసం తరచూ ఆస్పత్రికి వెళ్లేందుకు ఇబ్బంది కలగకుండా దగ్గరగా ఉంటుందని.. నందినగర్‌లోని ఇంట్లోనే ఉండాలని కేసీఆర్ నిర్ణయించు కున్నారని సమాచారం. అయితే తనను పరామర్శించేందుకు ఎవరూ రావద్దని ఆస్పత్రిలో ఉండగానే కెసిఆర్ విజ్ఞప్తి చేశారు. ఇక ఆస్పత్రిలో ఉన్న కేసీఆర్‌ను రాజకీయ, సినీ ప్రముఖులు పరామర్శించిన సంగతి తెలిసిందే. ఇదిలావుంటే మాజీ సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ప్రభుత్వం భద్రతను కుదించింది. ఆయనకు వై కేటగిరి' భద్రతను ప్రభుత్వం కేటాయించింది. మాజీ మంత్రులకు 2ప్లస్ 2 భద్రతను పోలీస్ శాఖ కేటాయించింది. మాజీ ఎమ్మెల్యేలకు పూర్తిగా భద్రత తొల గించింది. వారికి కేటాయించిన గన్‌మెన్లను పోలీసు ఉన్నతాధికారులు వెనక్కి పిలిపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎవరెవరికి భద్రత అవసరమనే అంశంపై.. ఉన్నతాధికారులతో సమీక్షించి అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. ఇంటెలిజెన్స్ నివేదిక మేరకు గన్‌మెన్లను పోలీసు శాఖ కేటాయించనుంది.

# సర్వీస్ కమిషన్ సభ్యుడు కారెం రాజీనామా

## తాము ఉద్యమ కారులమంటూ వ్యాఖ్య

**హైదరాబాద్,డిసెంబర్15 :** టీఎస్‌పీఎస్సీలో రాజీనామాల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే ఛైర్మన్ పదవికి జనార్దన్ రెడ్డి రాజీనామా చేయగా ఆ మరుసటి రోజు ఐదుగురు సభ్యులు రాజీనామా చేశారు. తాజాగా కారం రవీందర్ రెడ్డి కూడా రాజీనామా చేశారు. టీఎస్‌పీఎస్సీలో సిబ్బంది కొరత ఉన్నా నియామక ప్రక్రియ వేగవంతం చేశామని ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి తెలిపారు. ఇద్దరి తప్పిదానికి సంస్థ మనుగడకే నష్టం వచ్చిందన్నారు. సంబంధం లేని వ్యక్తులు సైతం అపవాదు మోస్తున్నారన్నారు. తాము ఉద్యమకారులమని, ఎప్పుడూ నిరుద్యోగుల పక్షానే నిలబడతామంటూ రవీందర్ రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీలో మొత్తం ఐదుగురు మెంబర్లున్నారు. ప్రొఫెసర్ బండి లింగారెడ్డి, కోట్ల అరుణ కుమారి, సుమిత్రానంద్ తనోబా, కారం రవీందర్ రెడ్డి, ఆర్.సత్యనారాయణ 2021 మే 21న సభ్యులుగా చేరారు. తాజాగా రవీందర్ రెడ్డి రాజీనామాతో అందరూ రాజీనామా చేసినట్టు అయింది. గ్రూప్1 ప్రిలిమ్స్, ఏఈఈ, డీఏఓ సహా పలు పోటీ పరీక్షలకు సంబంధించిన క్వశ్చన్ పేపర్లు లీక్ అయ్యాయి. దీంతో అప్పటికే నిర్వహించిన ఆయా పరీక్షలను టీఎస్?పీఎస్సీ రద్దు చేసింది. కొన్ని పరీక్షలను వాయిదా వేసింది. ఈ లీకులతో సంబంధం ఉన్న సుమారు వంద మందిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే కమిషన్ సెక్రటరీపై గానీ, సెక్షన్ ఆఫీసర్‌పై గానీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేసిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరుద్యోగులు ఆందోళనలు చేశారు. మరోపక్క నిరసనల మధ్యనే రెండోసారి గ్రూప్1 ప్రిలిమ్స్ నిర్వహించారు. కానీ ఈ ఎగ్జామ్ విషయంలో కూడా నిబంధనలు అమలు చేయలేదనే ఆరోపణలతో హైకోర్టు రద్దు చేసింది. ఈ క్రమంలో నిరుద్యోగుల్లో టీఎస్‌పీఎస్సీపై నమ్మకం తగ్గింది. కమిషన్ చైర్మన్, సెక్రటరీ సహా మెంబర్లను తొలగించాలనే నిరుద్యోగులు, రాజకీయ నేతలు డిమాండ్ చేశారు. ఇదే సమయంలో అసెంబ్లీకి ఎన్నికలు రావడంతో ప్రతిపక్షాలకు ఇదే ప్రధాన ఎజెండాగా మారింది. కాంగ్రెస్ పార్టీ ఏకంగా పలు పోటీపరీక్షల షెడ్యూల్‌తో కూడిన జాబ్ క్యాలెండర్‌ను రిలీజ్ చేసింది. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పదవి నుంచి జనార్దన్ రెడ్డి తప్పుకున్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లా బిఆర్ఎస్‌లో మంటలు

- తన ఓటిమికి కారకులను వదిలేది లేదన్న శంకర్ నాయక్

**వరంగల్,డిసెంబర్15 :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో బిఆర్ఎస్ అంతర్గ విద్వేషాలు భగ్గుమన్నాయి. తనను సొంతపార్టీ నేతలే కొందరు పనిగట్టుకుని ఓడించారని మహబూబాబాద్ మాజీ ఎమ్ఎల్యే శంకర్ నాయక్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇకపోతే మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్‌ల కారణంగా జిల్లాలో బిఆర్ఎస్ భ్రష్టు పట్టిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్ రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీంతో ఇప్పుడు ఈ వ్యవహారం జిల్లాలో కలకలం రేపుతోంది. శుక్రవారం తక్కళ్లపల్లి మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్ ఆత్మగౌరవం ఉన్న జిల్లా అని అన్నారు. ఎర్రబెల్లి, సత్యవతికి మంత్రి పదవులు ఇస్తే ఉద్యమకారులు బాధ పడ్డారని తెలిపారు. తెలంగాణ వాదం, ఉద్యమం తెలియని వారికి మంత్రి పదవి ఇస్తే ఎట్లా అని ప్రశ్నించారు. అధినేత వాస్తవాలు వినే అవకాశం ఇస్తే ఎవరైనా వాస్తవాలు చెబుతారన్నారు. వాస్తవాలు చెప్పే వారు బయట, జోకుడు గాళ్లు లోపల ఉంటే ఎలా వాస్తవాలు తెలుస్తాయని నిలదీశారు. ఖమ్మంలో ప్రతిసారి బయట గెలిచిన వారిని పార్టీలోకి తెచ్చుకుంటే నేతలు గ్రూపులుగా విడిపోయారన్నారు. ఎర్రబెల్లిని మంచి లీడర్ అంటే ప్రజలు ఉరికించి కొడతారని వ్యాఖ్యానిం చారు. ఆయన వల్లనే జిల్లాలో పార్టీకి ఆదరణ లేకుండా పోయిందని అన్నారు. ఎర్రబెల్లి చక్కిలి గింతలు పెట్టడం తప్ప ఎవ్వరికీ రూపాయి సహాయం చేయరని విమర్శించారు. కొన్ని జిల్లాల్లో తమ ఎమ్మెల్యేలు ప్రజలకు ఇరిటేషన్ పెంచారన్నారు. దానిని ఎలా మేనేజ్ చేయాలో పార్టీకి ప్లాన్ లేకపోతే ఎలా గెలుస్తామని అడిగారు. ఇకపోతే వరంగల్ జిల్లాలో మాజీ ఎమ్మెల్యేలకు సెక్యూరిటీ అవసరం లేదని... కుక్కలు కూడా వారి వెంట పడవంటూ తక్కలపల్లి రవీందర్ వ్యాఖ్యలు చేశారు. ఇకపోతే బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలో ఉండి ఎవ్వడు ఏ మోసం చేసిండో చూపిస్తా.. నాకు ఆల్రెడీ 55 సంవత్సరాలు క్రాస్ అయ్యాయి ఇంకా నన్ను ఏం చేస్తార్రబై.. ఒక్కొక్కడిని ఆట ఆడుకుంటా వేట మొదలైంది. కేసీఆర్ హాస్పిటల్‌లో ఉండి బుక్స్ చదువుతున్నాడు, భవిష్యత్తు ఎలా చెయ్యాలని... నేను, కేసీఆర్ ఒక్క కార్తెలోనే పుట్టాం బిడ్డ. కార్యకర్తలను కాపాడుకునే సత్తా నాకు పుష్కలంగా ఉంది. రాత్రి 12 గంటలకు ఆపద వచ్చిన ఫోన్ చేయండి వస్తా. నీకు ధైర్యం ఉంటే నా కార్యకర్తను ముట్టుకో, తర్వాత ఏమైతదో చూసుకో. ఇన్నిరోజులు ఎమ్మెల్యే పదవి ఉంది కాబట్టే అలోచించాను, ఇప్పుడు మనల్ని ఆపేటోడు లేదు. ఒక్క అయ్య అవ్వకు పుట్టి ఉంటే, నేను చేసిన తప్పులను నిరూపించాలని నాపై ఆరోపణలు చేసిన వారికీ సవాల్ చేసిన కానీ ఎవ్వడు రాలే. మనం ఎవ్వరి జోలికి పోవొద్దు, మన జోలికి వస్తే వదిలిపెట్టొద్దు. కార్యకర్తకు ఆపద వస్తే మెరుపు వేగంతో వస్తా... మీకు అండగా నిలబడుతా' అంటూ శంకర్ నాయక్ కామెంట్స్ చేశారు. అయ్యప్ప మాలధారణలో ఉండి మరీ శంకర్ నాయక్ ఈ మేరకు వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే శంకర్‌నాయక్ ఈ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేశారనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఆయన తన ఓటమిని జీర్ణించుకోలేక పోతున్నారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు.

# సిఎం జగన్ అక్రమాస్తుల కేసు

## తెలంగాణ హైకోర్టులో విచారణ

**హైదరాబాద్,డిసెంబర్15 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆస్తులపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసుపై మాజీ ఎంపీ హరిరామజోగయ్య ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్‌తోపాటు సీబీఐకి నోటీసులు జారీ చేసింది. అయితే ప్రతివాదులు అందరికీ ఇప్పటికీ నోటీసులు అందలేదు. ప్రజాప్రతినిధుల కేసులను త్వరగా విచారించాలని సుప్రీంకోర్టు గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ప్రజాప్రతినిధుల కేసులను సుమోటో పిల్ రూపంలో విచారిస్తోంది. ఈ ప్రజాప్రతినిధుల కేసుల సుమోటో పిల్‌ను, జగన్ కేసులపై దాఖలైన పిల్‌తో జతపరచాలని కోర్టు రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేసింది. వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసుల విచారణను ఎన్నికలలోపు పూర్తి చేయాలని మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య తన పిటిషన్‌లో కోరారు. వైఎస్ జగన్‌కు చెందిన ఇంకా 20 కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నట్లు చేగొండి హరిరామ జోగయ్య తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ వాదనలపై సీబీఐ తరఫు న్యాయవాది స్పందించారు. డిశ్చార్జి పిటిషన్ల పెండింగ్‌పై సీబీఐ కోర్టులో మెన్షన్ చేసినట్టు తెలంగాణ హైకోర్టు దృష్టికి తెలియజేశారు. ఇరు వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు డిశ్చార్జి పిటిషన్లపై రెండు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సీబీఐని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను మూడు నెలలకు వాయిదా వేసింది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై ఉన్న అక్రమాస్తుల కేసుల విచారణ గతంలో ప్రతి శుక్రవారం జరిగేది. సీఎంగా బాధ్యతలు చేపట్టక ముందు వరకూ ప్రతి శుక్రవారం జగన్ కోర్టుకు హాజరయ్యేవారు. అయితే సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వివిధ కారణాలు, అధికారిక బాధ్యతల కారణంగా విచారణకు హాజరు కావడం లేదు. మధ్యలో కోవిడ్ కారణంగా కోర్టు విచారణ నిలిచిపోయింది. ఆ తర్వాత శుక్రవారం కూడా విచారణ జరగడం లేదు. అందుకే త్వరగా విచారణ చేపట్టాలని హరిరామజోగయ్య హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు జగన్ అక్రమాస్తుల కేసును సిబిఐ చేపట్టింది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన తండ్రి అధికారాన్ని ఉపయోగించుకుని అక్రమ మార్గాల్లో భారీగా ఆస్తులు కూడబెట్టారని సీబీఐ కేసులు నమోదు చేసిది.

# టాటా ఏస్ బోల్తా: 15మంది కూలీలకు గాయాలు

**యాదాద్రి,డిసెంబర్15 :** టాటా ఏస్ వాహనం బోల్తా పడిన ఘటనలో 15మంది కూలీలు గాయపడ్డారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగింది. ఈ ప్రమాదంలో 15 మందికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం బొల్లెపల్లి గ్రామ శివారులో వలస కూలీలను తీసుకెళ్తున్న టాటా ఏస్ వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో వాహనంలో 15 మంది కూలీలకు గాయాలయ్యాయి. వారందరిని భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అందులో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో.. వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కు తరలించామని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం సమయంలో టాటా ఏస్ వాహనంలో ప్రయాణించిన వారంత ఆంధ్రప్రదేశ్ బాపట్లకు చెందిన వలస కూలీలుగా గుర్తించారు.

# అవసరమైతే మద్దతు ఇస్తానన్న మల్లారెడ్డి

## తీన్మార్ మల్లన్నతో సరదా సంభాషణ



**హైదరాబాద్,డిసెంబర్15 :** ఎప్పుడూ సరదాగా మాట్లాడే మాజీమంత్రి మల్లారెడ్డి మరోమారు తనదైన శైలిలో స్పందించారు. అవసరమైతే కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంలో వెనకాడనని అన్నారు. అసెంబ్లీ నుంచి బయటికి వస్తుండగా మాజీ మంత్రి మల్లారెడ్డికి తీన్మార్ మల్లన్న ఎదు రుపడ్డారు. తీన్మార్ మల్లన్నను మల్లారెడ్డి ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇరువూరూ పలకిరించుకున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. తీన్మార్ మల్లన్న మేడ్చల్‌లో పోటీ చేస్తే ఎవరో ఒక మల్లన్నే అసెంబ్లీలోకి వచ్చేవారని మల్లారెడ్డి అన్నారు. ఇద్దరు మల్లన్నలు వచ్చేవారు కాదన్నారు. కాంగ్రెస్‌కు శాసనసభలో ఎప్పుడైనా సభ్యులు తక్కువ అయితే మద్దతు ఇస్తావా అని మల్లారెడ్డిని తీన్మార్ మల్లన్న ప్రశ్నించగా.. కచ్చితంగా ఇస్తానని మల్లారెడ్డి తెలిపారు. ఎన్నికల అప్పుడే రాజకీయాలు తర్వాత అందరం ఒక్కటే అంటూ మాజీ మంత్రి మల్లారెడ్డి ముక్తాయింపునిచ్చారు. అవసరం అయితే అప్పుడు చూద్దాంలే అని అనడం విశేషం.

# ప్రభుత్వ విప్‌లుగా నలుగురు ఎమ్మెల్యేలు

**హైదరాబాద్,డిసెంబర్15 :** తెలంగాణ ప్రభుత్వ విప్ లుగా నలుగురు ఎమ్మెల్యేలు నియమితులయ్యారు. అసెంబ్లీలో విప్‌లను నియమించడం ఆనవాయితీ. అధికార పార్టీకి చెందిన వారిని నియమిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరు లక్ష్మణ్ కుమార్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను విప్ లుగా నియమించింది. మరోవైపు ప్రభుత్వ చీఫ్ విప్‌నకు సంబంధించి కూడా త్వరలో నియామక ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. చీఫ్‌విప్‌గా పలువురు పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ఇందులో రంగారెడ్డి జిల్లాకు చెందిన మల్‌రెడ్డి రంగారెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ , వేముల వీరేశం పేర్లను ప్రభుత్వం పరిశీలిస్తుందని సమాచారం. దీనిపైనా ఒకటిరెండు రోజుల్లో స్పష్టత రానుంది.

# లోక్‌సభ భద్రతా వైఫల్యం

## కీలక నిందితుడు లలిత్ ఝా లొంగుబాటు



**న్యూఢిల్లీ,డిసెంబర్15 :** లోక్‌సభలో భద్రతా వైఫల్య ఘటనలో ఆరో వ్యక్తి, కీలక నిందితుడు అయిన లలిత్ ఝా లొంగిపోయినట్లు ఢిల్లీ పోలీసులు శుక్రవారం తెలిపారు. అతనికి కోర్టు ఏడు రోజుల పోలీస్ కస్టడీ విధించినట్లు ప్రకటించారు. గురువారం రాత్రి లలిత్ లంగిపోయాడని, అతనిని 15 రోజుల పాటు కస్టడీకి అప్పగించాల్సిందిగా కోరినట్లు తెలిపారు. బీహార్‌కి చెందిన లలిత్ ఝా కోల్‌కతాలో టీచర్‌గా పనిచేస్తున్నారని అన్నారు. సహోద్యోగులు, పొరుగువారు అతను శాంతంగా ఉండే వ్యక్తిగా పేర్కొన్నారని అన్నారు. రెండేళ్ల క్రితం కోల్‌కతా నుండి వెళ్లిపోయినట్లు తెలిపారు. ప్రముఖ స్వాతంత్య పోరాట యోధుడు భగత్ సింగ్‌ను చూసి లలిత్ ప్రేరణ పొందాడని అన్నారు. పార్లమెంట్ వెలుపల పొగను వదులుతున్న దృశ్యాలను వీడియో తీశారని, వాటిని అతని సన్నిహితుడు, ఎన్‌జిఓ వ్యవస్థాపకుడు నీలాకాష్ ఎయిచ్‌కు పంపారని తెలిపారు. ఈ వీడియోలు మీడియాలో వచ్చేవిధంగా చూడాలని లలిత్ కోరినట్లు వెల్లడించారు. బుధవారం నాటి ఘటనకు సంబంధించి అరెస్టు చేసిన ఐదుగురు నిందితులపై పోలీసులు చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (ఉపా) కింద కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. నిందితులు డి.మనోరంజన్, సాగర్, అమోల్ షిండే, నీలందేవిలను బుధవారం అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడు విశాల్‌ను గురుగ్రామ్‌లో అరెస్ట్ చేశారు.

# ప్రముఖ యూట్యూబర్ చందు సాయి అరెస్ట్

## ప్రేమపేరుతో మోసం చేశాడని యువతి ఫిర్యాదు

**హైదరాబాద్,డిసెంబర్15 :** ప్రముఖ యూట్యూబర్ చందు సాయిని పోలీసులు అరెస్ట్ చేశారు. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. యువతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న విషయాల ప్రకారం.. నార్సింగికి చెందిన యువతిని చందు సాయి ప్రేమ పేరుతో మోసం చేశాడు. ఆమెపై అత్యాచారం కూడా చేశాడు. తర్వాత ముఖం చాటేశాడు. మోసపోయానని గ్రహించిన యువతి పోలీసులను ఆశ్రయించింది. అతనిపై అత్యాచారం, మోసం కేసు నమోదైంది.నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యూట్యూబర్‌ని అరెస్టు చేశారు. ఇదిలా ఉంటే చందు సాయి యూట్యూబ్‌లో బాగా పాపులర్. చందు గాడు, పక్కింటి కుర్రాడు లాంటి యూట్యూబ్ ఛానెల్స్ లో వీడియోలు చేసేవాడు. కామెడీ వీడియోల ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. అతను పనిచేసే యూట్యూబ్ ఛానెల్‌లకు మిలియన్ల కొద్దీ వీక్షణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కొన్ని పుకార్లు కూడా షికారు చేయడం ప్రారంభించాయి. నెలకు రెండు కోట్లు సంపాదిస్తున్నాడని.. పెద్ద బంగ్లా, పడవ లాంటి కారు ఉందని ప్రచారం జరిగింది.

# మావోయిస్టు అగ్రనేత హిడ్మా హతం

## ఎన్‌కౌంటర్‌లో హతమైనట్లు పోలీసుల ప్రకటన

**భోపాల్,డిసెంబర్15 :** మూడు రాష్ట్రాలను ముప్పు తిప్పలు పెట్టిన మోస్ట్ వాంటెడ్ మావోయిస్ట్ మడకం హిడ్మా అలియాస్ చైతు ఎన్‌కౌంటర్‌లో హతమైనట్లు మధ్యప్రదేశ్ పోలీసులు ప్రకటించారు. గురువారం మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లా ఖాంకోదాదర్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే హిడ్మా మృతిపై మావోయిస్టు కేంద్ర కమిటీ నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. ఇదిలావుండగా, పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హిడ్మా చినపోయాడంటూ గతంలోనూ అనేక వార్తలు వచ్చాయి. ఎన్ కౌంటర్‌లో చనిపోయాడంటూ వార్తలు వచ్చిన కొద్ది రోజులకే తాను బతికే ఉన్నానంటూ హిడ్మా పోలీసులకే సవాల్ విసురుతూ వచ్చాడు. దీంతో ప్రస్తుతం హిడ్మా మృతిపై అనేక మంది సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాలాఘాట్ జిల్లా ఖామ్‌కోదాదర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టు దళాలు తిష్ట వేసినట్లు మధ్యప్రదేశ్‌కు చెందిన హాక్ ఫోర్స్ సిబ్బందికి పక్కా సమాచారం అందింది. దీంతో వెంటనే అక్కడ పోలీసులను మోహరించారు. పోలీసులు రావడాన్ని గమనించిన మావోలు ఎదురుకాల్పులు చేశారు. పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన హోరాహోరీ కాల్పులులో చివరకు హిడ్మా మృతి చెందాడు. అలాగే ఇద్దరు మహిళలతో పాటూ మరో నలుగురు మావోయిస్టులు కూడా చనిపోయారు.

# కెసిఆర్‌పై అభిమానానికి కృతజ్ఞతలు: కవిత



**హైదరాబాద్,డిసెంబర్15 :** క్లిష్ట సమయంలో దేశ నలుమూలల నుంచి బీఆర్ఎస్ అధినేత, కేసీఆర్ పట్ల ప్రేమా భిమానాలు కనబర్చినందుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కృతజ్ఞతలు తెలిపారు. యశోద హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత కేసీఆర్ నంది నగర్ లోని తన నివాసానికి చేరుకున్న నేపథ్యంలో కవిత 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తుంటి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమై యశోద హాస్పిటల్ నుంచి కేసీఆర్ డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. కేసీఆర్‌కు చికిత్స అందించిన డాక్టర్లు, నర్సులతో పాటు అన్ని విధాలా సహకరించిన దవాఖాన సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ క్లిష్టమైన సమయంలో దేశ నలుమూలల నుంచి లభించిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞులమని పేర్కొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో మాది ఒంటరి పోరాటం

- సర్వేలకు అందని విధంగా లోక్‌సభ ఫలితాలు
- ఎవరితోనూ పొత్తులు లేవని తేల్చిన కిషన్ రెడ్డి
- ముఖ్య నేతలతో సమావేశంలో కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్,డిసెంబర్15 :** జనసేనతో ఇక పొత్తులు లేవని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఏ పార్టీతో పొత్తులు ఉండవని స్పష్టం చేశారు. తెలంగాణ లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని కిషన్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. సర్వేలకు అందని విధంగా లోక్‌సభ ఫలితాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా రాష్ట్ర బీజేపీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో పొత్తులపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యనేతలు జిల్లా అధ్యక్షులు, ఇంచార్జ్ లు, పార్లమెంట్ ప్రబారీలు తదితరలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ నేతలు, క్యాడర్‌కు కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. డిసెంబర్ చివరి వారంలో తెలంగాణకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రానున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తులు ఉండవని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ పొత్తు.. అన్నది కేవలం ప్రచారం మాత్రమే అని కొట్టిపారేశారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తోందని తేల్చిచెప్పేశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో సమాన పోరాటాలుం టాయన్నారు. లోక్‌సభలో అత్యధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. తెలంగాణలో రాజకీయంగా బీజేపీకి మంచి అవకాశముందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు క్యాడర్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సర్వే సంస్థలకు కూడా అందని విధంగా లోక్‌సభ ఫలితాలుంటాయన్నారు. శనివారం నుంచి తెలంగాణలో వికసిత్ భారత్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర పథకాలను ప్రజల్లో తీసుకెళ్ళాలని కేడర్‌కు సూచించారు. కొత్తగా ఎన్నికైన 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు అన్ని ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తారన్నారు. తెలంగాణలో మూడోసారి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడబోతోందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీకి సంబంధించి అన్ని కమిటీల నియామకాలు పూర్తి చేయాలని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే పొత్తులపై కిషన్ రెడ్డి వ్యాఖ్యలు జనసేన వర్గాల్లోనూ చర్చనీయాంసం అవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన బీజేపీతో పొత్తులు పెట్టుకోవాలని అనుకోలేదు. తన పార్టీ తరపున 32స్థానాల్లో పోటీ చేయాలని అనుకున్నారు. కానీ బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, లక్ష్మణ్ రాయబారం చేసుకుని .. జనసేనకు ఎనిమిది సీట్లు ఇచ్చి పొత్తులు పెట్టుకున్నారు. అయితే తెలంగాణలో జనసేన ఎక్కడా ప్రభావం చూపలేదు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలతో కలిసి పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం చేశారు. తెలంగాణలో జనసేన పార్టీ చీఫ్ పవన్ కల్యాణ్ ఇమేజ్ కలిసి వస్తుందనుకుని పొత్తు పెట్టుకున్న బీజేపీ వ్యూహం బెడిసికొట్టింది. జనసేనతో పొత్తు వల్ల ఇరు పార్టీలకు మేలు జరగలేదు. జనసేన పార్టీ పోటీ చేసిన ఎనిమిది చోట్లా బీజేపీ కార్యకర్తలు జనసేనకు మద్దతు ఇవ్వలేదని ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. సంప్రదాయంగా బీజేపీ ఓటు బ్యాంక్ కూడా జనసేనకు అనుకూలంగా రాలేదు. తాండూరు లాంటి చోట్ల గతంలో బీజేపీకి పది వేల ఓట్లు వచ్చాయి. ఆ ఓటు బ్యాంక్ బదిలీ కాలేదు. కూకట్ పల్లిలోనూ అంతేనన్న విశ్లేషణలు వచ్చాయి. ఈ కారణంగానే జనసేనతో పొత్తు విషయంపై కిషన్ రెడ్డి ప్రకటన చేసి ఉంటారని భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ ఇప్పటికే ఏపీలో బీజేపీతో కలిసి ఉన్నామని చెబుతూంటారు కానీ.. ఆ పార్టీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. టీడీపీతో కలిసి పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ఎన్నికల సమయంలో ఏర్పడిన పొత్తు ఏపీకి కూడా వస్తుందని పవన్ మనసు మార్చుకుని బీజేపీతో కలిసి పోటీ చేస్తారని అనుకున్నారు. కానీ తెలంగాణలో జనసేనను దూరం చేసుకోవాలని బీజేపీ నిర్ణయించుకోవడంతో ఏపీలో కూడా ఇక బీజేపీతో కలిసే అవకాశం ఉండదని అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పటికీ జనసేన పార్టీ ఎన్డీఏలో భాగస్వామిగా ఉంది. ఎన్డీఏ నంచి బయటకు రాలేదు. కానీ పొత్తుల గురించి జాతీయ పార్టీ నిర్ణయిస్తుందని కిషన్ రెడ్డి ప్రకటన కాదని జనసేన వర్గాలు చెబుతు న్నాయి. కానీ పొత్తుల వల్ల పరస్పర ఉపయోగం ఉంటేనే... బీజేపీ హైకమాండ్ అంగీకరిస్తుందని. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి ప్రయోజనం కలగనందున జనసేన పార్టీకి సీట్లు కేటాయించే అవకాశం ఉండదని అంచనా వేస్తున్నారు. ఎన్నికలకు ఇంకా మూడు నెలల సమయం ఉన్నందున ఎప్పుడు ఏం జరుగుతుందో అంచనా వేయలేమని.. ఎన్నికలకు ముందే కలిసి పని చేస్తామా లేదా అన్నదానిపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు.



# మొన్నటి ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగలే

## ఎన్నికల్లో ఫలితాలు బిజెపిని నిరాశపరిచాయి

## గజ్వేల్ కార్యకర్తల భేటీలో ఈటెల రాజేందర్



**సిద్దిపేట,డిసెంబర్15 :** తెలంగాణలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగివుంటే ఫలితాలు మరోలా ఉండేవని బీజేపీ నేత, మాజీ మంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. మొన్నటి ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగలేదన్నారు. అలా జరిగే ఉంటే ప్రజలు, ధర్మం, న్యాయం గెలిచేవన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో బీజేపీ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో బీజేపీకి 14 వందల పైగా ఓట్లు వస్తే ఇప్పుడు ప్రతీ గ్రామంలో కమలం పార్టీకి పెద్ద ఎత్తున కార్యకర్తలు తయారయ్యారని ఈటల అన్నారు. అలాంటపపుడు ఓట్లు పెరగాల్సి ఉందిన్నారు. కానీ అలా జరగేలదన్నారు. ఎన్నికల తీరు, ఫలితాలు బిజెపికి నిరాశ కలిగించిన మాట వాస్తవమన్నారు. ఇప్పుడు జరిగిన ఎన్నికలు రాష్ట్ర ఎన్నికలని, రేపు జరగబోయే ఎన్నికలు నరేంద్ర మోడీకి సంబంధించిన ఎన్నికలన్నారు. ఈ ఎన్నికల్లో 8 స్థానాలు గెలుచుకొని రెండు పార్టీలకు బీజేపీ ముచ్చెమటలు పుట్టిస్తోందన్నారు. స్కీములైనా తాను చేస్తున్నామని, తాము ఇస్తున్నామని ఏ నాడూ ప్రధాని మోదీ అనలేదని ఈటల పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తుందని మాత్రమే అంటారని పేర్కొన్నారు. కానీ తెలంగాణలో మాత్రం ఏ స్కీములైనా కేసీఆర్ తానిస్తున్నానని అంటారన్నారు. కేసీఆర్ ఏమైనా ఆయన ఇంట్లో నుంచి ఇస్తున్నాడా.. నీయబ్బ జాగీరా అని మేము ఎన్నోసార్లు ప్రశ్నించాం. మొన్న జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ గెలిస్తెనే ఏ స్కీములైన వస్తాయని, పెన్షన్‌లు, కళ్యాణ లక్ష్మి ఉంటాయని, రియల్ ఎస్టేట్ ఉండాలంటే కేసీఆర్ ఉండాలని బీఆర్ఎస్ నాయకులు ప్రజలను భయబ్రాంతులకు గురి చేశారని ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ ప్రజలు కెసిఆర్ హామీలకు, బిఆర్ఎస్ స్కములకు లొంగలేదన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఈటెల రాజేందర్ గజ్వేల్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

# ఉచిత బస్సుప్రయాణంతో నష్టపోతున్నాం

## తమను ఆదుకోవాలంటూ ఆటో డ్రైవర్ల ఆందోళన

హైదరాబాద్,డిసెంబర్15 : ఆర్టీసీ ఉచిత బస్సు సర్వీస్ వల్ల ఆటో డ్రైవరలకు తీవ్ర నష్టం జరుగుతుందని బీఎంఎస్ ఆటో యూనియన్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 70 శాతం మహిళలు ఆటోల్లో ప్రయాణిస్తారని అన్నారు. అయితే.. గతంలో రోజుకు 1000 రూపాయలు ఆదాయం వస్తే.. ఇప్పుడు కనీసం 300 కూడా రావట్లేదని వాపోతున్నారు. ఉచిత ఆర్టీసీ సర్వీస్ స్కిం కు భారతీయ మజ్దూర్ సంఘం అద్వర్యంలో వరుసగా నిరసన కార్యక్రమలకు పిలుపునిస్తున్నామని అన్నారు. ఉచిత పథకాలతో ఆటో డ్రైవర్ల ఉపాధి పై ప్రభుత్వం దెబ్బ కొట్టద్దని తెలిపారు. ప్రభుత్వ అనుబంధ ఆఫీసుల్లో ఆటోలు పెట్టుకోవాలని.. లేదా బస్సుల సంఖ్య తగ్గించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం రవాణా చట్టానికి విరుద్ధంగా ఓల ఊబర్ సర్వీస్ లను తెచ్చిందని మండిపడ్డారు. తమ సమస్యల పట్ల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటో డ్రైవర్ల తో చర్చలు జరపాలని తెలిపారు. లేదంటే ఈనెల 18న ధర్నాలు, ఎమ్మెల్యేలకు, కలెక్టర్లకు 19న వినతిపత్రాలు సమర్పిస్తామని అన్నారు. 20న ఆర్టీసీ డిపోల దగ్గర శాంతియుతంగా ఆందోళన చేపడతామని అన్నారు.21న, 22న ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాలు జరిపిస్తామని క్లారిటీ ఇచ్చారు. ఆ తర్వాత పూర్తి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి అయినా తమ సమస్యలను పరిష్కరించి ఆటో డ్రైవర్లకు తగిన సహాయం అందించాలని కోరారు. గత ప్రభుత్వం రవాణా చట్టం ప్రకారం ఓలా, ఉబర్, రాపిడ్ వైట్ ప్లేట్ బైక్ లకు అనుమతి ఇవ్వొద్దు అని చెప్పిన పట్టించుకోలేదని కన్నీరుమున్నీరయ్యారు. రాష్ట్రంలో 8లక్షల మంది ఆటో డ్రైవర్ లు ఉన్నారని.. వారి భవిష్యత్ అంధకారంలోకి వెళ్ళిందని వాపోతున్నారు. ఆటో సంఘాలతో చర్చలు జరపకపోతే ఛలో హైద్రాబాద్ కు పిలుపునిస్తామని, ప్రజా భవన్ ముట్టడిస్తామని అన్నారు.

# పదేండ్ల నిర్బంధం నుంచి తెలంగాణ విముక్తి

(మొదటిపేజీ తరువాయి)



దృష్టితో చూస్తుందన్నారు. అనిచివేతకు, వివక్షకు గురైన ప్రతి వర్గానికి తమ ప్రభుత్వంలో స్థానం ఉంటుందన్నారు. గ్రామీణ అభివృద్ధిలో గత ప్రభుత్వం ప్రచారానికే పరిమితం అయ్యిందన్నారు. ప్రతి గ్రామ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమ కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ధరణి పోర్టల్ స్థానంలో భూమాత పేరుతో పోర్టల్ తెస్తామని హామీ ఇచ్చామని.. కార్యచరణ రూపొందిస్తామన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే దిశగా కృషి చేస్తాం. ప్రజా ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రజావాణి చేపట్టాం. కొత్త ప్రభుత్వం ప్రయాణం ప్రజాసేవకు అంకితం కావాలని కోరుకుంటున్నాను. రైతులు, యువత, మహిళలకు ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది. ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. ప్రజా సంక్షేమం కోసమే ఆరు గ్యారెంటీలు ప్రకటించాం. హామీలకు చట్టబద్ధత కల్పించే దస్త్రంపై తొలి సంతకం చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతిమాటకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే రెండు గ్యారెంటీలు అమలు చేశాం. వచ్చే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలుకు కార్యాచరణ రూపొందిస్తు న్నాం. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రజల ఆరోగ్య భద్రత.. మా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీని ప్రస్తుత అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ. 10 లక్షలకు పెంచాం. ఎన్నికల వేళ కాంగ్రెస్ ప్రకటించిన అన్ని డిక్లరేషన్లు అమలు చేస్తాం. అమరవీరుల కుటుంబాలకు 250 గజాల ఇంటి స్థలం, గౌరవభృతి ఇస్తాం. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇచ్చేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రతి పంటకు మద్దతు ధర ఇస్తాం. రూ. 2 లక్షల రుణమాఫీపై త్వరలోనే కార్యాచరణ ఉంటుంది. అసైన్డ్, పోడు భూములకు త్వరలోనే పట్టాల పంపిణీ చేపడుతాం అని గవర్నర్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా యువతకు మేం ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చుతాం అని గవర్నర్ స్పష్టం చేశారు. ఏడాది లోపు మా ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తుందని, ఆరు నెలల్లో మెగా డీఎస్సీ నిర్వహించి, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. రైతులు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళ, యువత, అమరవీరుల కుటుంబాలు, ఉద్యమ కారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులు ఇలా ప్రతీ వర్గాన్ని పరిగణనలోకి తీసుకుని సంక్షేమం, అభివృద్ధి కార్యాచరణ ఉంటుంది. యువత జాబ్ క్యాలెండర్ విషయంలో చెప్పిన మాట ప్రకారం కార్యాచరణ ఉంటుందని గవర్నర్ స్పష్టం చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఎక్కువ వ్యతిరేకత రావడానికి కారణమైన ఉద్యోగ నోటిఫికేషన్లు. సంక్షేమ కార్యక్రమాల్లో ఆదర్శంగా ఉంటున్నామని చెప్పుకున్న పాలకులు ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టలేకపోయారు. అందుకే ఆ ప్రభుత్వంపై ఎక్కువ వ్యతిరేకత వచ్చింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా చెప్పినట్టుగానే నోటిఫికేషన్లు ఇవ్వబోతున్నట్టు గవర్నర్ ప్రసంగంలో తెలియజేసింది. ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో ఎక్కడెక్కడ లోపాలు ఉన్నాయో ఎక్కడ దుబారా జరిగిందో కనిపెట్టే పనిలో యంత్రాంగం ఉందని వివరించారు. ప్రజలపై భారం మోపకుండానే సంక్షేమ పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రభుత్వం మాటల కంటే చేతల్లో ఎక్కువ చూపిస్తుందని భవిష్యత్‌లో ఆ మార్పు ప్రజలే గమనిస్తారని కూడా గవర్నర్ స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగంముగిసినఅనంతరంఅసెంబ్లీ శనివారానికి వాయిదా పడింది.

# ఓటమితో కుంగిపోకుండా ముందుకు సాగుదాం

## వచ్చే ఎన్నికల్లో సత్తా చాటేలా పోరాడుదాం

## కార్యకర్తలకు మాజీ మాజీ ఎంపీ వినోద్ కుమార్ పిలుపు

**కరీంనగర్,డిసెంబర్15 :** అసెంబ్లీ ఎన్నికల ఓటమితో కుంగిపోవద్దని, భవిష్యత్ మనదేనని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. వచ్చే అన్ని ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జనరంజకంగా పాలన సాగించినప్పటికీ కొద్ది తేడాతో ఓడిపోయామన్నారు. ప్రజా క్షేత్రం లోకి వెళ్లి స్థానిక సంస్థలు, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతూ ముందుకు సాగుదామని వినోద్ కుమార్ అ న్నారు. చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని రామడుగు మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వినోద్ కుమార్ హాజరై మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి గల కారణాలను కార్యకర్తలను అడిగి తెలుసుకు న్నారు. పాలనలో జరిగిన చిన్న చిన్న లోపాల తోనే పార్టీ ఓటమిని చవిచూడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.లోపాలను సరిచేసుకొని వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. కేసీఆర్ పాలనలో దేశంలోనే రాష్ట్రానికి ఒక ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, ఆదాయ వనరులను మెరుగుపరచుకోవడంలో దేశంలోనే రాష్ట్రం రెండో స్థానంలో ఉందని గుర్తు చేశారు. బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవరు అధైర్యపడవద్దని, ప్రజా క్షేత్రంలో ప్రజల పక్షాన పోరాడుదామన్నారు.

# పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండ

## బిఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి 2లక్షల చెక్కు అందచేత

**మెదక్,డిసెంబర్15 :** బీఆర్ఎస్ పార్టీకి అపజయం తాత్కాలికమేనని కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన చిన్న శంకరంపేటకు చెందిన డప్పు నరసింహులు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. మృతుడికి పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2,00,000 ఇన్సూరెన్స్ చెక్కును మృతుడి భార్య శోభకు శుక్రవారం వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నరసింహులు మృతి చెందడం బాధాకరమని, చనిపోయిన కార్యకర్త కుటుంబానికి పార్టీ ఇన్సూరెన్స్ చెక్కు కొండత భరోసా నిస్తుందని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్త చనిపోతే రెండు లక్షల రూపాయల బీమా అందిస్తున్న ఏకైక పార్టీ దేశంలో బీఆర్ఎస్ ఒక్కటేనని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో శంకరంపేట ఆర్ మండల పార్టీ అధ్యక్షులు రాజు, శంకరంపేట్ పట్టణ పార్టీ అధ్యక్షులు హేమ. చంద్రం, వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, ఎంపీటీసీ యాదగిరి, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి లక్ష్మణ్,దయానంద్ యాదవ్ నాయకులు కుమార్ గౌడ్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ ప్రభాకర్, స్వామి,శ్రీనివాస్ నరేష్ వెంకటేశం లక్ష్మణ్, చిలక నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవాలి

ఇటీవలి ఎన్నికల్లో కొన్నిరాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కొలవుదీరాయి. అందులో బిజెపి ప్రభుత్వాలు కూడా ఉన్నాయి. మధ్యప్రదేశ్,రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్‌లో బిజెపి ప్రభుత్వాలు కొలువుదీరాయి. తెలంగాలో కాంగ్రెస్ పార్టీ, కర్నాటకలోనే ఆరు నెలల క్రితమే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అలాగే మిజోరంలో మిజో పార్టీ అధికారం చేపట్టింది. ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఎవరివైనా కేంద్రం తనవంతు సాయం, మద్దతు కొనసాగించాల్సిందే. అభివృద్ధి కోసం ఈ రాష్ట్రాలను పట్టుకుని ముందుకు సాగాల్సిందే. అప్పేడ దేశం కూడా అభివృద్ధికి బాటలు వేస్తుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సందర్భంగా ప్రధాని మోడీ అభినందనలు తెలుపుతూ కేంద్రం అన్ని విధాల అండగా ఉంటుందని మాటిచ్చారు. నిజానికి అన్ని రాష్ట్రాలకు కేంద్రం అండగా ఉండాలి. అక్కడి ప్రభుత్వాలు ఏ పార్టీవన్నది పక్కన పెట్టి ముందుకు సాగాలి. రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు.. ఈ రెంటిని అనుసంధానిస్తూ ముందుకు సాగాలి. నీతి ఆయోగ్ ఏర్పాటు సందర్భంగా ప్రధాని మోడీ కూడా కేంద్ర రాష్ట్ర సంబంధాలపై కొత్త నిర్వచనం ఇచ్చారు. కానీ మోడీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. నిధుల కేటాయింపు మొదలు, అభివృద్ధి పనులు కూడా పరస్పర విశ్వాసంతో కొనసాగించాలి. రాష్ట్రాలు తప్పుదోవ పడుతున్న సందర్భంలో అవసరమైన హెచ్చరికలు కూడా చేయాలి. ఇదే సందర్భం లో తాజాగా మారిన రాజకీయాల క్రమంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక స్తితిపైనా హెచ్చరికలు చేయడం మంచిదే. ఇకపోతే సిఎంలుగా ప్రతి ఒక్కరూ ప్రధానితో నిరంతరం సమీక్షించుకునే అవకాశాలు ఉండాలి. కనీసం ఒక్కో రాష్ట్రానికి ప్రధాని నెలలో ఒకరోజయినా సమయం కేటాయించి రాష్ట్రాల బాగోగులు, సమస్యలు చర్చించాలి. రాష్ట్రాల సమాహారమే దేశం అన్న విషయాన్ని మరవరాదు. రాష్ట్రాల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం పెద్దన్న పాత్ర పోషజంచాలి. విద్య,వైద్యం, ఆర్థిక రంగాల్లో నిరంతరంగా చేయూత ఇవ్వాల్సి ఉంటుంది. ధాన్యం సేకరణ, నదీజలాల కేటాయింపు సమస్యలు,విద్యుత్ సమస్యలు, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలు వంటివి ఏవైనా కేంద్రం కూడా పెద్దతరహాలో రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అప్పుడే కేంద్ర రాష్ట్రాల మధ్య బంధం బలోపేతం అవుతుంది. పార్టీలు వేరయినంత మాత్రాన దేశం వేరు కాదన్న విషయం ఆయా రాష్ట్రాల సిఎంలు కూడా గమనించాలి. అలాగే కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న అధికారిక సంబంధాలు వేరు. సిఎంలుగా ఎవరైనా ఉండవచ్చు..ప్రధానిగా మరెవరైనా ఉండవచ్చు.. కానీ వీరి రాజకీయాలకు రాష్ట్రాల అభివృద్ధి బలికావద్దు. రాష్ట్ర ముఖ్యమంత్రులు ఎవరైనా కావచ్చు పాలనాపర విషయాల కోసం కేంద్రంతో నిత్యం సంబంధాలు నెరపాల్సిందే. పార్టీలు ఏవైనా అధికారంలో ఉన్నది ఎవరైనా కేంద్రంతో నిరంతరాయంగా అనుసంధానం అవుతూనే ఉండాలి. ఏ ముఖ్యమంత్రి అయినాఢిల్లీ పర్యటనకు వెళ్లడం వంటివి రాజకీయ కోణంలో చూడరాదు. ఫెడరల్ వ్యవస్థలో సిఎంలు ప్రధానిని ,కేంద్ర మంత్రులను, కేంద్ర అధికారులను కలవడం సర్వసాధారణం. ఇది విమర్శించే రాజకీయ పార్టీలు గుర్తించాలి. తెలంగాణలో ఇప్పుడు కొత్తగా కాంగ్రెస్ ప్రబుత్వం ఏర్పడింది. సిఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఓ వారం రోజుల క్రితం కొత్త ప్రభుత్వం ఏర్పడింది. మర్యాద పూర్వకంగా సిఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి ఫోన్ చేసి మద్దతు కోరారు. రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఇందులో కొత్తేమీ లేదు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు అనేకానేక సమస్యలు కేంద్రం వద్ద పెండింలో ఉన్నాయి. విభజన హామీలు అమలు కాలేదు. రోడ్ల విస్తరణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదు. వీటిని ఆపడం వల్ల నష్టపోతున్నది ప్రజలే అని బిజెపి నేతలు గుర్తించాలి. కేంద్రంలో అధికారం లేకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు చొరవ తీసుకున్న కాంగ్రెస్ పార్టీ నిస్సహాయంగా నిలబడింది. ఇకపోతే పలు పెండింగ్ ప్రాజెక్టులు, జిఎస్టీ నిధుల విడుదలకు సంబంధించి కేంద్రంతో సమస్యలు ఉండనే ఉన్నాయి. ఇవన్నీ కూడా పరిష్కరించుకోవడం సిఎంగా రేవంత్ రెడ్డి తక్షణ కర్తవ్యం. ఇవన్నీ చక్కబెట్టుకోవడం కోసం ఢిల్లీకి వెళ్లాల్సిందే. కేంద్ర రాష్ట్ర సంబంధాలు వేరు..రాజకీయ పోరాటాలు వేరని గుర్తించాలి. రాష్ట్రాలకు సంబంధించి అనేక సమస్యలను ఎప్పుడూ నిలదీయడంలోనూ వెనకడుగు వేయరాదు. గత పదేళ్లుగా తెలంగాణ విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముఖ్యంగా మోడీ ఎందుకనో నిర్లక్ష్యంగా ఉన్నారు. అనేకానేక సమస్యలను పట్టించు కోవడం లేదు. అందువల్ల రాజకీయ విభేదాలను కట్టిపెట్టాలి. అభివృద్ధికి సంబంధించి రాష్ట్రాలతో కలసి చర్చించాలి. అప్పుడే పటిష్టమైన దేశంగా అభివృద్ధి సాధించగలదు. అందుకు మోడీ అడుగులు వేయాలి.అప్పుడే దేశం యావత్తూ హర్షిస్తుంది. బిజెపియేతర ప్రభుత్వాలను కూడా విశ్వాసంలోకి తీసుకుంటేనే అర్థం ఉంటుంది.

## వచన కవితా పితామహుడు కుందుర్తి

### డిసెంబర్ 16...కుందుర్తి ఆంజనేయులు జయంతి



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

అభ్యుదయ కవి గా, రచయితగా, వచన కవితా ఉద్యమ ఆధ్యునిగా, నయాగరా కవులలో ఒకరిగా తెలుగు సాహితీ ప్రియులకు సుపరిచితుడు వచన కవితా పితామహుడు అనే బిరుదాంకితుడైన కుందుర్తి ఆంజనేయులు. ఆయన అభ్యుదయ కవి, ప్రముఖ తెలుగు రచయిత. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. తన కవిత్వంతో తెలంగాణా సాయుధ పోరాటానికి అజ్యం పోసిన కవులలో ప్రముఖుడు.పాతకాలం పద్యమైతే, వర్తమానం వచన గేయం....అని ఎలుగెత్తి చాటిన వచన కవితోద్యమకారుడు కుందుర్తి. సాంప్రదాయ పద్యానిదే పై చేయిగా ఉన్నరోజుల్లో ఛందస్సు పై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు కుందుర్తి. ఆంజనేయులు 19 22 డిసెంబర్ 16 న కామయ్య , నరసమ్మ దంపతులకు నర్సారావు పేట సమీపంలోని కోట వారి పాలెంలో వ్యవసాయ బ్రాహ్మణ కుటుంబములో జన్మించాడు. ఆయన వినుకొండలో చదువుకున్న కాలములో గుర్రం జాషువా ఆయనకు తెలుగు మాష్టారుగా బోధించారు. 1936 నుండి 1941 వరకు విజయవాడ పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో చదివాడు. అక్కడే 1937లో కవిత్వం వ్రాయటం ప్రారంభించాడు. విజయవాడ ఎస్.ఆర్.ఆర్. కళాశాలలో అయన కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వద్ద శిష్యునిగా ఉన్నాడు. ఆ తరువాత గుంటూరు ఆంధ్రా క్రైస్తవ కళాశాల నుండి బి.ఏ ఉత్తీర్ణుడు అయినాడు.ఆంజనేయులు నరసరావుపేటలో నవ్యకళా పరిషత్తు స్థాపించాడు. ఆ కాలంలోనే ఆయన కమ్యూనిష్టు భావాలకు ఆకర్షితుడైనాడు. దేవేంద్రపాడు గ్రామములోని రెసిడెన్షియల్ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా, ప్రిన్సిపాలుగా పనిచేశాడు. అనంతరం గుంటూరు పొగాకు మార్కెట్ లో పని చేశాడు. 1956లో కర్నూలులో సమాచార ప్రసారశాఖలో అనువాదకునిగా చేరాడు. ఆ తరువాత హైదరాబాదుకు బదిలీ అయ్యాడు. 1958లో ఫ్రీవర్స్ ఫ్రంట్ స్థాపించాడు. 1967లో యువతలో వచన కవిత్వాన్ని ప్రోత్సహించ డానికి ఉత్తమ వచన కవిత్వానికి ఒక బహుమతి అందజేయడం ప్రారంభించాడు. 1977లో ఉద్యోగ జీవితము నుండి విరమణ పొందాడు. 1944లో కుందుర్తి అంజనేయులు... ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసులతో కలిసి మొట్టమొదటి కవితా సంకలనం నయగారా ప్రకటించాడు. ఈ ముగ్గురూ నయగారా కవులుగా ఆధునిక తెలుగు సాహిత్యములో ప్రసిద్ధి చెందారు. అంజనేయులు సమగ్ర రచనలు 1974లో ప్రచురించ బడినవి. తెలంగాణ కవితా సంపుటిలో మొత్తం 26 కవితలున్నాయి. కుందుర్తి అనేక పురస్కారాలు అందుకున్నాడు. వాటిలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు 1969లో అందుకున్న సోవియట్ లాండ్



నెహ్రూ పురస్కారము ప్రతిష్ఠాత్మకమైనవి.మహా భారతం తరహాలో తెలంగాణా పోరాట కథను 18 పర్వాలు గా విభజించి తొలిసారిగా వచన కవిత్వంలో మహా కావ్యాన్ని రాసిన ఘనత కుందుర్తి కే దక్కుతుంది. సాహిత్యాన్ని పామరులకు సైతం దగ్గరగా తీసుకు వెళ్లిన గొప్పతనం వచనానిదే. అందుకే కుందుర్తి వచన కవిత్వానికి ఆద్యుడైనాడు.కుందుర్తి పేరు జ్ఞప్తికి తెచ్చుకుంటే గుర్తుకు వచ్చే కవిత "నగరంలోని వాన".నగరంలో వానకవిత్వం నా ఊహాంచలాల్లో కదిలాడుతున్నట్లుజల్లులు జల్లులై కురుస్తుంది " అంటూ మొదలై, నగరంలో కురిసే వాన మనుషులతో ఆడే దాగుడు మూతలు , నగర వాసులకు కలిగించే ఇబ్బందులు, అప్పుడప్పుడు చూపించే కనికరం అన్నింటిని హృద్యంగా వర్ణించాడు కుందుర్తి. గాంధీజీ హతుడైన సందర్భంలో "మహాత్ముడిక లేడు" అనే కవితలో " గౌరీ శంకర శిఖరం యేరుగా పారింది, గంగానది శోక బాష్పములు కాల్వలు కట్టింది, వెన్నెల హృదిలో, తమస్సు తెర విరిసింది, నీవు వాటికి సహోదరుడువు, వాటి కీర్తికి సహోదరుడవు" అంటూ వర్ణించాడు.ఆయన రచనలలో సౌప్తికం, రసధుని, అమావాస్య, నా ప్రేయసి, నయాగరా, తెలంగాణ, దండియాత్ర, ఆషా, నగరంలో వాన, నాలోని వాదాలు, హంస ఎగిరిపోయింది, తీరా నేనుకాస్త ఎగిరిపోయాక, మేఘమాల, ఇది నా జెండా, కుందుర్తి పీఠికలు, కుందుర్తి వ్యాసాలు, బతుకు మాట మొదలైనవి ముఖ్యమైనవి. వచనాన్ని సాహిత్యముగా పరిగణించని రోజులలో కందుర్తి వచన కవిత్వాన్ని ప్రోత్సహించాడు. సాంప్రదాయ పద్య కవిత్వము గతమని, వచన కవిత్వము వర్తమానమని చాటాడు. 1982 అక్టోబర్ 25న మరణించాడు. ఆయన మరణించిన తరువాత ప్రముఖ సాహితీ సమితి రంజని ఆయన పేరిట 1984 నుంచి ఇప్పటి వరకు ఏటేటా వచన కవితల పోటీలు నిర్వహించి అవార్డులు ప్రకటిస్తూ ఉంది. మరణించిన తరువాత కూడా ఆయన యువ కవులకు ఈ విధంగా స్ఫూర్తి ప్రదాతగా నిలిచే ఉన్నాడు.

## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం




'ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ " శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుట కు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు...

-ఎడిటర్

# రాజకీయాల్లో ఉన్నా మహిళలు పురుషుల చేతికిందే ఉండాలా?

### ఎదిరిస్తే మహిళలకు బహిష్కరణే బహుమానమా?



సిహెచ్ వ ప్రభాకర్ రావు సీయర్ జర్నలిస్ట్, 9391533339

ఈతరం మహిళా నాయకురాలి రాజకీయ జీవితాన్ని అంతం చేయడమే లక్ష్యంగా కొంత మంది నాయకులు కుట్ర పన్నారని ఒక వర్గం విమర్శిస్తుంది. ఆధునిక మహిళగా, స్వేచ్ఛాయుత జీవితాన్ని గడుపుతూ, మనుధర్మాన్ని, మనుధర్మంలో చిత్రీకరించిన విధంగా వంటింటికే పరిమితం కానీ, పురుషాధిక్యాన్ని ఎదురించే మహిళలకు తగిన గుణపాఠం నేర్పడానికే ఒక పార్లమెంట్ సభ్యురాలిని పార్లమెంట్ నుండి బహిష్కరించారని ప్రతిపక్షాలు బిజేపి పై విమర్శనాస్త్రాలు గుప్పిస్తున్నాయి. అమెరికాలో చదువుకొని, జే పి మార్గాన్ లాంటి ప్రపంచస్థాయి సంస్థలో, వివిధ దేశాలలో పని చేసిన బెంగాల్ రాష్ట్రానికి చెందిన మహువా మొయిత్ర ను, పార్లమెంట్ లో అడిగిన "ప్రశ్నలకు పైసలు" తీసుకొన్నారనే నెపంతో, పార్లమెంట్ నుండి ఆమెను బహిష్కరించడం అంటే ప్రభుత్వాన్ని, ముఖ్యంగా ఆదాని-మోడి ల సంబంధాలను ప్రశ్నించినందు వల్లనే ఆమె మాటలు వినకుండా, ఆమెను ఏకపక్షంగా బహిష్కరించారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో 2005 లో, 10 మంది పార్లమెంట్ సభ్యులను ఇలానే "ప్రశ్నలకు పైసలు" తీసుకొన్నారనే ఆరోపణలతో,ప్రత్యేక కమిటీ వేసి, బహిష్కరించారు. అప్పుడు, ఇప్పుడు కూడా ఆరోపణలు ఎదుర్కొన్న పార్లమెంట్ సభ్యుల వివరణ తీసుకోలేదు. అప్పటికి ఇప్పటికీ పరిస్థితులలో ఎలాంటి మర్మపులేదు. కానీ ఇప్పుడు పూర్తిగా ప్రధానిపైనా, అతని మిత్రుడు ఆదాని పై ప్రశ్నలు ఆడగడమే ప్రతిపక్షాల విమరశాలకు తావిస్తుంది. గతంలో కాంగ్రెస్ విధవ అని అని మహిళల పట్ల విమర్శలు చేసిన బిజేపి నాయకులు, స్త్రీల పట్ల వ్యవహరిస్తున్న తీరును, ముఖ్యంగా, మహువా వ్యక్తిగత జీవితాన్ని ప్రశ్నిస్తున్న నాయకులు, స్త్రీలు స్వతంత్రంగా వ్యవహరించడంలో, వివాహం చేసుకోకుండా ఒంటరిగా జీవించడాన్ని తప్పు బడుతూ చేసిన విమర్శలు, మహువా పట్ల వారికి ఉన్న గౌరవం, ఆమె పట్ల వారికున్న ద్వేషాన్ని తెలియకనే చెపుతున్నాయి. తెలఉగు సాహిత్యంలో విప్లవాత్మక పాత్రలు సృష్టించిన చలం సాహిత్యంలోని స్త్రీ లా ఉన్న మవహువా మొయిత్ర ను సనాతన ధర్మాన్ని పాటించే ఎవరు కూడా హర్షించరానడంలో అతిశయోక్తి లేదు. ఇప్పటికీ భారతదేశంలో స్త్రీ అంటే, ఎంత చదువుకొన్నా, ఎంత పెద్ద ఉద్యోగం చేసినా, కుటుంభాన్ని అంటి పెట్టుకొని ఉండాలని, తులసి కోట చుట్టూ తిరుగుతూ పతివ్రతలా జీవించాలనే మనస్తత్వంతో



ఉండాలని కోరుకొనే సమాజంలో మహువా మొయిత్ర నిజంగా చీడ పురుగు లాంటి వ్యక్తి అని వీరంతా భావిస్తున్నారు. తనకంటే చిన్న వయసులో ఉండే ఒక న్యాయవాదితో కొంత కాలం సహజీవనం కొనసాగించడం, క్లబ్ లు, పబ్ లు తిరగడం, మగమహారాణి లా పురుషులతో కలిసి తిరగడం, అధికార పార్టీని తన వాక్ పటిమతో పార్లమెంట్ లో కానీ బయట కానీ ఎండగట్టడం మహువా నైజాంలా మారింది. గతంలో కూడా రాహుల్ గాంధీని, సంజయ్ సింగ్ లను పార్లమెంట్ కు రాకుండా చూడడంలో బిజేపి విజయం సాధించింది. అంశం ఏదైనా, అధికార పార్టీని విమర్శించే వారికి పార్లమెంట్ లో స్థానం ఉండదని చెప్పే ప్రయత్నం చేస్తున్న నిరంకుశ ధోరణిని ప్రజాస్వామ్య వాదులు విమర్శిస్తున్నారు. మహువా మొయిత్ర తన పార్లమెంట్ వెబ్ సైట్ లాగిన్, పాస్ వర్డ్ ఇతరులకు ఇచ్చిన విషయం దేశ భద్రతతో ముడిపడి ఉందనే వాదనలో లేదని పార్లమెంట్ సభ్యులే అంటున్నారు. కంప్యూటర్ విషయ పరిజ్ఞానం లేని ఎంతో మంది పార్లమెంట్ సభ్యులు తమ లాగిన్ వివరాలను ఇతరులకు ఇచ్చి, తమ ప్రశ్నలను అందులో నమోదు చేస్తారని వివరించారు. అందులో నిజానిజాలు అందరికీ తెలసినా, మహువా ప్రశ్నలు అదిగినందుకు డబ్బులు తీసుకొన్నారనే ఆరోపణలు రుజువు కాకున్నా, డబ్బులు ఇచ్చారని ఆరోపించిన వారిని విచారించకుండానే, ఆమెను బహిష్కాం యించడంలోని ఔచిత్యాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నారు. అదే సమయంలో దానీష్ అలీ పై బిజేపి సభ్యుడు రమేష్ బిదురీ చేసిన అప్రజాస్వామిక విమర్శలను విచారించాల్సిన ఎథిక్స్ కమిటీ ఎలాంటి విచారణ చేపట్టలేదు. అంతే కాకుండా, ఆయనకు ప్రమోషన్ ఇస్తూ, రాజస్తాన్ ఎన్నికల్లో కొన్ని నియోజక వర్గాలకు ఇంచార్జ్ గా పంపింది. మరో వైపు మాయావతి, దానేష్ అలిని పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని పార్టీ నుండి బహిష్కరించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మాయావతి బిజేపి సూచనల మేర పనిచేస్తుందేమో అనే అనుమానాలకు తావిస్తుంది. ఎథిక్స్ కమిటీ లో సభ్యుడైన జెడియు నాయకుడు కమిటీ మహువా తో కమిటీలో వ్యవహరించిన రతీరును ప్రశ్నిస్తున్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు ఉత్తమ కుమార్ కమిటీ సమావేశానికి హాజయారు కావడానికి సరియన సమయం ఇవ్వకుండానే సమావేశం నిర్వహించారని చెప్పారు. పార్లమెంట్ నిర్ణయాన్ని ప్రశ్నించడం సాధ్యం కాదు. కానీ అది కూడా ఒక స్వేచ్ఛగా, ఆధునిక జీవిత శైలితో జీవించే మహిళను బహిష్కరించడం అంటే, మహిళలకు, ముఖ్యంగా రాజకీయాలలో ఉండే మహిళలకు ఒక హెచ్చరికగా చూస్తున్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం

### సీజనల్ వ్యాధుల నివారణకు ఇదే మార్గం



**విజయవాడ,డిసెంబర్15 :** ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతలకు అలవాటు పడలేక పోతున్నారు. ఇది కొనసాగితే విషజ్వరాలు లేదా, అంటువ్యాధులు ప్రబలవని వైద్యనిపుణులు అంటున్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్తాలను, స్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి. ప్రతి ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాంల వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. పలు పట్టణాల్లో మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల ఏలూరులో వింతవ్యాధి ఇటీవల ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలుతున్న విషయం సుస్పష్టం. ఈ క్రమంలో ప్రజలు పురపాలకసంస్థపై ధ్వజమెత్తుతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యం తోనే సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుద్ధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి.ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్ధ్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుద్ధ్య నిర్వహణలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పురపాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుద్ధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభిం చాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించగలమని అన్నారు.

# పోలీస్ నియామకాలు వెంటనే చేపట్టండి

### అధికారులకు సి.ఎం. రేవంత్ రెడ్డి సూచన

**హైదరాబాద్,డిసెంబర్15 :** పోలీస్ నియామక ప్రక్రియను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదే శించారు. పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలో నియామకాలపై డా.బీ.ఆర్ . అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహి ంచారు. ఈ సమీక్షా సమావేశానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ రవీ గుప్తా, పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు చైర్మన్ శ్రీనివాస రావు, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎ.ఎం. రిజ్వి, సి.ఎం ఓ అధి.కారులు శివధర్ రెడ్డి, శేషాద్రి, షా-నవాజ్ కాసీం, ఆర్థిక శాఖా కార్యదర్శి శ్రీదేవి, నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 'ఉద్యోగ నియామ కాలను అత్యంత పారదర్శకంగా, ఎలాంటి అవకత వకలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.. నియా మకాల ప్రక్రియలో ఉన్న లోటుపాట్లు, వాటిని వాటిని అధిగమించే అంశాలపై సవివరమైన నివేదిక ఇవ్వాలని అధికారులను సి.ఎం ఆదేశిం చారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు జరిగిన ఉద్యోగ నియామకాలపై కూడా నివేదిక ఇవ్వాలని కోరారు. సాధ్యమైనంత త్వరగా పోలీస్ ఉద్యోగ నియామకాల పక్రియను పూర్తి చేయాలని అన్నారు. పోలీసు, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు కోరుకొండ స్కూల్ మాదిరి రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేస్తామన్నారు. విధి నిర్వహణలో తీవ్ర పని ఒత్తిడి, ఎక్కువ సమయం విధులు నిర్వహించే పోలీస్, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల విద్య కోసం ప్రత్యేక శ్రద్ధ చూపే అంశంపై సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. పోలీస్ ఉన్నతాధికారుల నుండి కానిస్టేబుల్ వరకు, ఆర్టీసీలో ఉన్నతాధికారుల నుండి కండక్టర్, క్రింది స్థాయి ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటుచేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కోరుకొండ సైనిక్ స్కూల్ మాదిరిగా ఈ పాఠశాల ఉండాలన్నారు. ఉత్తర, దక్షణ తెలంగాణా లో ఈ పాఠశాలలు ఏర్పాటు చేసేందుకై తగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖలో గత ఏడెనిమిదేళ్ళుగా హోమ్ గార్డుల నియామకాలు లేవని, పోలీస్ శాఖలో మరింత సమర్థవంతంగా సేవలు ఉపయోగించుకునేందుకై వెంటనే హోమ్ గార్డుల నియామకాలను చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి డీజీపీని ఆదేశిం చారు. హోమ్ గార్డుల ఆరోగ్యం, ఆర్థిక,వైద్య అవసరాలు తీరేలా తగు చర్య లు చేపట్టాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ క్రమబద్దీ కరణ కు హోమ్‌గార్డులసేవలనుమరింతవిస్తృత స్థాయిలో ఉపయోగించుకోవాలని సూచించారు.

## 3వ రోజు ప్రతిష్టాపన ఉత్సవాలు



**కొడిమ్యాల డిసెంబర్ 15 (ప్రజామంటలు):** శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి నూతన ఆలయ ప్రతిష్టాపన ఉత్సవాలలో భాగంగా ఈరోజు విశ్వక్సేనవిధి, పలాది వాసం, పుష్పాదివాసం, బలిదాన విధి, నిత్య పూర్ణహుతి తీర్థ ప్రసాద వితరణ, జలాదివాసం, క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఇట్టి పూజా కార్యక్రమాలు ఉ.. వే.. జగన్నాథం విష్ణు వర్ధనాచార్యులు బృందం, ఆలయ అర్చకులు నాగరాజు రమేశ్ అధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇట్టి పూజ కార్యక్రమంలో దాతలు, నిర్మాణ కమిటీ, భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జన్మదిన సందర్భంగా మైక్ సెట్ బహుకరణ

### చిన్నారిని అభినందించిన నాయకులు



**చిగురుమామిడి డిసెంబర్ 15 (ప్రజామంటలు):** చిగురుమామిడి మండలం ఇందుర్థి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు భీమర రేణుక లక్ష్మణ్ దంపతుల ఏకైక కుమార్తె చిన్నారి బిమర సహస్ర జన్మదిన సందర్భంగా ఇందుర్తి మండల పరిషత్ పాఠశాలలో జన్మదిన సందర్భంగా పదివేల రూపాయల విలువగల బ్లూటూత్ మైక్ సెట్ బహుకరించిన తల్లిదండ్రులుఇందుర్తి గ్రామంలో వారి కుమార్తె జన్మదిన సందర్భంగా ప్రతి సంవత్సరం ఒక బహుమతిని అందజేయడం అభినందనీయమని లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సీనియర్ జర్నలిస్ట్ గాదే రఘునాథ్ రెడ్డి భీమర రేణుక లక్ష్మణ్ దంపతులను అభినందించి వీరి లాగానే ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని గ్రామ నాయకులుకి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు స్కూల్ చైర్మన్ మాజీ జెడ్పిటిసి అందేస్వామి మాజీ వార్డు సభ్యులు అందే సురేష్ నాయకులు గట్టు ఎల్లయ్య, బురికి ప్రభాకర్, అంగన్వాడి టీచర్లు మావురవ్వ, విజయ, సరస్వతి, గ్రామస్తులు రవి, లక్ష్మణ్, సదానందం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట స్ట్రీట్ వెండర్ల ఆందోళన



**జగిత్యాల డిసెంబర్ 15 (ప్రజామంటలు):** తమ షాప్ లను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్ట్రీట్ వెండర్లు ప్రజావాణి లో ఫిర్యాదు మేరకు సమస్య పరిష్కారంకు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన అదనపు కలెక్టర్ తమపై కక్ష్య సాధింపు చర్యల లాగ అధికారులు వ్యవహారిస్తున్నారని స్ట్రీట్ వెండర్ ల ఆరోపణలు చేశారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని సూచించిన మున్సిపల్ ఇంచార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ హామీతో స్ట్రీట్ వెండర్లు ఆందోళన విరమించారు.



కోరుట్ల పట్టణ శివారులోని పెంట ఉశాలు కొబ్బరి తోటలో గడ్డి వాము దగ్ధం. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించినట్టుగా అనుమానం. మంటలు చెలరేగడంతో ఫైర్ సిబ్బంది వచ్చి ఆర్పివేశారు. సుమారు 1500 గడ్డి కట్టలు కాలి బూడిద అయ్యాయి.

# అంగరంగ వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

ప్రతి ఒక్కరు గోవును పూజించాలి

హిందూ సాంప్రదాయాలను కాపాడాలి

ఒక్కరి ఇంటిపై కాషాయపు జెండా ఎగరాలి

చక్రవర్థుల పురుషోత్తం గురు స్వామి





**కోరుట్ల రూరల్ డిసెంబర్ 15 (ప్రజామంటలు):** కోరుట్ల మండలం నాగులపేట గ్రామం లో గూడెం అయ్యప్ప దేవస్థాన గురు స్వామి చక్రవర్తుల పురుషోత్తం స్వామి ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు బ్రహ్మన్న గారి శంకర్ శర్మ, కిషన్ శర్మ మరియు నాగులపేట గ్రామ స్వాములు ఘనంగా పడి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం స్వామి మాట్లాడుతూ నాగులమ్మ దేవాలయం లో గత 22సంవత్సరాలుగా గ్రామ అయ్యప్ప స్వామి సేవా సమితి మరియు గ్రామ ప్రజల సహకారం తో నిర్వహిస్తున్నారని ఈ గ్రామం లో నాగులమ్మ స్వయంభూ గా వెలసిందని కోరిన కోర్కెలు తీర్చే అమ్మ వారని సమస్త కాల సర్ప, కుజ దోషాలు తొలగి పోతాయని ఇలాంటి అమ్మ వారి సన్నిధిలో పడి పూజ చేయించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. హిందూ సంస్కృతీ ని కాపాడాలని ప్రతి ఒక్కరు పిల్లలకు భగవద్గీత నేర్పించాలని ప్రతి హిందువు ఇంటి పైన కాషాయ జెండా ఎగరాలని అదే విధంగా గో పూజ చేయాలని గోవులను పెంచాలని తెలిపారు. అయ్యప్ప మండపాన్ని అరటి ఆకులతో చక్కటి మండపాన్ని ఏర్పర్చి అష్ట దళ కళాశాలతో అయ్యప్ప స్వామికి పంచామృత కళాశాభిశేకం నిర్వహించి పదునేనిమిది మెట్ల పూజ నిర్వహించారు. అయ్యప్ప భజన తో భక్తులు పులకరించారు. ఈ కార్యక్రమంలో తోట నారాయణ, గ్రామ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, గురుస్వామి లక్ష్మి నారాయణ, స్వాములు నాగరాజు, నర్సారెడ్డి, నారాయణ రెడ్డి, సుధాకర్, సాగర్ స్వాములు మహిళలు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## "మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి"

### జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా





**జగిత్యాల డిసెంబర్ 15 ( ప్రజామంటలు):** పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్స్ లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహిళా/స్వశక్తి సంఘాల రుణ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ.... యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివిధ శాఖల తరపున మహిళా సంఘాలకు 15 కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేయడం సంతోషమని.. మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడుతూ ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా మరికొంత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆమె సూచించారు. ప్రభుత్వం మరియు బ్యాంకుల ద్వారా అనేక పథకాలు, రుణాలు అందిస్తున్నామని, వాటిని అందిపుచ్చుకొని ఆర్థికంగా వృద్ధి సాధించాలని ఇందుకోసం తమకు నచ్చిన రంగంలో, అనుభవం ఉన్న రంగాల్లో బ్యాంకులు అందించే రుణ సదుపాయాలను పొంది యూనిట్లు ప్రారంభించి ఇతరులు అభినందించేలా, స్ఫూర్తిని పొందేలా కార్యచరణ రూపొందించు కోవడమే కాకుండా తగిన కృషి చేయాలని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. నిజామాబాద్ రీజినల్ డిప్యూటీ రీజనల్ హెడ్ శివ కోటయ్య మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ద్వారా మహిళలకు తాము అందించే వివిధ పథకాల గురించి వివరించడమే కాకుండా వ్యాపార, వాణిజ్య సంస్థలను ఏర్పాటు చేయాలనుకునే మహిళలకు త్వరితగతిన రుణాలు అందిస్తామని మరింత ఎక్కువ మంది ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పొన్న వెంకట్ రెడ్డి, సెర్ప్ డిపిఎం మాణిక్ రెడ్డి, మెప్మా ఏఓ శ్రీనివాస్, యూబీఐ చీఫ్ మేనేజర్ సరళ్ గుప్త, వివిధ శాఖల మేనేజర్లు, సెర్ప్, మెప్మా సిబ్బంది వివిధ మండలాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సేవలను వినియోగించుకోవాలి

### సిడిపిఓ వీరలక్ష్మి



**జగిత్యాల డిసెంబర్ 15 ( ప్రజామంటలు):** అంగన్వాడీ కేంద్రాల ద్వారా తల్లులకు, పిల్లలకు అందించే సేవలను అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని జగిత్యాల సిడిపిఓ వీరలక్ష్మి అన్నారు. జగిత్యాల పట్టణంలోని కొత్తవాడ అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిడిపిఓ వీరలక్ష్మి మాట్లాడుతూ 6 నెలలు దాటిన పిల్లలకు తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారాన్ని అందించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా అయ్యే కోడిగుడ్లు,పాలు బాలామృతాన్ని గర్భిణులు, పిల్లలు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. 3 సంవత్సరాలు దాటిన పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను అందించడం జరుగుతుందని, ఆటపాటల విద్య ద్వారా పిల్లల్లో మానసిక వికాసం పెంపొందడంతో పాటు సృజనాత్మకత, ఇతర నైపుణ్యాలు అలవడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ స్వరూపారాణి, అంగన్వాడీ టీచర్లు రజిత, ఏ. మాధవి, వి. మాధవి, తల్లులు పాల్గొన్నారు.

### ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా

## 'ఆవుల పద్మ' ను సన్మానించిన జిల్లా కలెక్టర్



**సైదాపూర్ డిసెంబర్ 15 (ప్రజామంటలు):** కరీంనగర్ కలెక్టర్ ఆడిటోరియంలో ప్రపంచ దివ్యంగుల దినోత్సవములో వికలాంగులకు చేసిన సేవలను గుర్తించి సైదాపూర్ మండలం జాగేరిపల్లె గ్రామానికి చెందిన తెలంగాణ దివ్యాంగుల నెట్ వర్క్ అధ్యక్షురాలు ఆవుల పద్మను జిల్లా కలెక్టర్ సమేల సత్పతి చేతుల మీదుగా శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన ఆహారం అందించాలి

### జడ్పిటిసి సభ్యులు గీకురు రవీందర్





**చిరుమామిడి డిసెంబర్ 15 (ప్రజామంటలు):** చిగురుమామిడి మండలంలోని నవాబ్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను స్థానిక జడ్పిటిసి సభ్యులు గీకురు రవీందర్ ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పిల్లలతో కలిసి తినీ పరీక్షించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిష్టర్ పరిశీలించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యులు గీకురు రవీందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమతో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యాబోధన విద్యార్థుల ప్రగతి పై దృష్టి కేంద్రీకరించి ప్రతినెల మూడవ శనివారం పిటియం కార్యక్రమాన్ని చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పేరెంట్ టీచర్ సమావేశాలలో విద్యార్థుల విద్యా మానసిక సామర్థ్యాలను పిల్లల తల్లిదండ్రులకు తెలియ చెప్పాలన్నారు. పరిసరాలు, మూత్రశాలల పరిశుభ్రతను పాటించాలన్నారు. పాఠశాల అభివృద్ధిలో గ్రామపంచాయతీ పాలకవర్గం, విద్యా కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు, స్వయం సహాయక గ్రూపుల సభ్యులు భాగస్వామ్యులు కావాలన్నారు. విద్యార్థుల కోరిక మేరకు పదవ తరగతి ప్రత్యేక క్లాసులకు హాజరయ్యే వారికి అక్షర ఫౌండేషన్ నుంచి అల్పాహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ బోయిన్ పద్మ, ప్రధానోపాధ్యా యులు రాజయ్య, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్ సింగ్, బోయిన వంశీకృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఠాకూర్ రానా ప్రతాప్ సింగ్, బోయిని వేణు గోపాల్, కాంగ్రెస్ నాయకులు పిల్లి తిరుపతి, బోయిని విజయ్ కుమార్, ఎన్నం నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మత్స్య రంగంలో మహిళలు రాణించాలి

**సైదాపూర్ డిసెంబర్ 15 (ప్రజామంటలు):** సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామంలో జిల్లా ఉపాధ్యక్షులు పెసర కుమారస్వామి ఆధ్వర్యంలో మత్స్య రంగంలో మహిళలు రాణించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు కుమారస్వామి ముదిరాజ్ అన్నారు. శుక్రవారం వెన్నంపల్లి మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు ఎన్నికల అధికారి, నిర్వహించారు. ఎన్నికల్లో ఏకగ్రీవంగా మహిళా మత్స్య పరిశ్రమిక సహకార సంఘం అధ్యక్షులుగా నెల్లి వినీషా, ఉపాధ్యక్షులుగా రేగుల సుజాత, కార్యదర్శిగా పెసర మంజుల, కోశాధికారిగా పెసరు అలేఖ్య, డైరెక్టర్లుగా పెసరు వనమాల, పెసర సరోజన, పెసర స్వరూప, అన్నవేని రేణుక, నెల్లి శారద, లు ఎన్నికల అధికారి సాల్వరి తిరుమల్ రావు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఉపాధ్యక్షులు పెసరు కుమారస్వామి ముదిరాజ్ మాట్లాడుతూ.... మహిళలు మత్స్యరంగంలో రాణించాలని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినిచేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు, మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులు, ముదిరాజ్ నాయకులు నెల్లి శ్రీనివాస్ ముదిరాజ్, పెసర కొమురయ్య ముదిరాజ్, రేగుల తిరుపతి ముదిరాజ్, రేగుల చంద్రమౌళి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సన్మాన కార్యక్రమం



**చిగురుమామిడి డిసెంబర్ 15 (ప్రజామంటలు):** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మహిళలు, పిల్లల, దివ్యాంగుల మరియు వయేవృద్దుల జిల్లా సంక్షేమ శాఖ అధికారి సరస్వతి, డిఎంఎచ్ఓ లలితా దేవి, జెడ్పీ చైర్మన్ కనుమల్ల విజయ, డిఆర్డిఏ శ్రీలత, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతీ చేతుల మీదుగా సన్మాన కార్యక్రమంలో భాగంగా నవాబుపేట గ్రామానికి చేందిన దివ్యాంగుడైన తెలంగాణ దివ్యాంగుల పట్ట భద్రుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంధి నాగరాజు కు ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రంతో సత్కరించారు.

prajamantalau daily pages (16-12)_times of varha main (13-2).qxd 12/16/2023 5:14 AM Page 5






## ప్రభుత్వ విప్ గా “అడ్లూరి” నియామకం పట్ల హర్షం



**జగిత్యాల డిసెంబర్ 15 (ప్రజామంటలు):** ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ విప్ గా నియామకం కావడం పట్ల మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, బతికేపల్లి సర్పంచ్ తాటిపర్తి శోభారాణి, బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్ లు హర్షం వ్యక్తం చేశారు. జగిత్యాలలో శుక్రవారం వారు మాట్లాడుతూ....మొదటిసారిగా ఎమ్మెల్యే గా అసెంబ్లీలో అడుగుపెట్టిన లక్ష్మణ్ కుమార్ కు కాంగ్రెస్ ప్రభుత్వంలో విప్ గా నియమించడం శుభపరిణామమన్నారు. ధర్మపురి నియోజకవర్గం అభివృద్ధికి దోహధ పడే విధంగా లక్ష్మణ్ కుమార్ కు ప్రభుత్వ విప్ పదవి కట్టబెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు నర్సాగౌడ్, శంకర్, రామగౌడ్, లింగన్న, చారి, చల్ల తిరుపతి, గాదె ప్రభాకర్, మ్యాకల ధర్మయ్య, గాదె శంకర్ లు అడ్లూరికి ప్రభుత్వ విప్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. లక్ష్మణ్ కుమార్ నియామకానికి సహకరించిన కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, తదితరులకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.


## స్థానిక సంస్థల ఎలక్షన్స్ బీఎస్పీని బలోపేతం చేయాలి

### జిల్లా ఇన్చార్జి డేగల వెంకటేష్




**హుస్నాబాద్ డిసెంబర్ 15 (ప్రజామంటలు):** బహుజన సమాజ్ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏడు మండలాల పరిధిలో పార్లమెంటు స్థానిక సంస్థల ఎలక్షన్స్ బీఎస్పీని బలోపేతం చేయాలని కరీంనగర్ ఎంపీ మరియు సర్పంచులు గెలిపించుకోవాలని జిల్లా ఇన్చార్జి డేగల వెంకటేష్ మరియు బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దోళ్ల శ్రీనివాస్ యాదవ్ చెప్పడమైనది. నియోజకవర్గ స్థాయిలో మండల కమిటీలు పూర్తిస్థాయి లో బాధ్యతలు ప్రకటించాలి. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జిలు ఎలగందుల శంకర్ నీలికొండ బిక్షపతి నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రాజు నియోజకవర్గ మహిళా కన్వీనర్ పందిపెల్లి రమాదేవి ప్రధాన కార్యదర్శి తొందర్ సాయి, తేజ సీనియర్ నాయకులు బోయిన బాబు, మండల అధ్యక్షులు దుంద్ర రాంబాబు, ఉపాధ్యక్షుడు రుద్రారం శరత్ బాబు, రాయికుంట రమేష్, పట్టణ అధ్యక్షుడు పరశురాములు, హరీష్, శ్రీనివాస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీలో ట్రీట్మెంట్ పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



**సికింద్రాబాద్ డిసెంబర్ 15 (ప్రజామంటలు):** చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ ఆసుపత్రిలో ట్రీట్మెంట్ పొందుతూ, ఓ గుర్తు తెలియని వ్యక్తి చనిపోయాడు. సబ్ ఇన్ స్పెక్టర్ కె. సబిత కథనం ప్రకారం...ముషీరాబాద్ ఎక్స్ రోడ్డు సమీపంలో దాదాపు 55 ఏండ్ల వయస్సు కలిగిన వ్యక్తి అనారోగ్యంతో కింద పడి ఉండటాన్ని గమనించిన పెట్రోలింగ్ పోలీసులు వెంటనే గాంధీ ఆసుపత్రి కి తీసుకెళ్ళి అడ్మిట్ చేయించి, ట్రీట్మెంట్ ఇప్పించారు. ట్రీట్మెంట్ పొందుతూ, సదరు వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లేకపోవడంతో డెడ్ బాడీని గాంధీ మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. ఫొటోలోని వ్యక్తి ని గుర్తుపట్టిన వారు తమకు సమాచారం ఇవ్వాలని ఎస్.ఐ. కోరారు.

## గొల్లపల్లి మండల కేంద్రంలో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

### ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ విప్ గా నియామకం పట్ల సంబరాలు



**గొల్లపల్లి (ప్రజామంటలు) డిసెంబర్ 15:** ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ విప్ గా ప్రభుత్వం నియమించడాన్ని హర్షిస్తూ గొల్లపల్లి మండల కేంద్రంలో గొల్లపల్లి సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మస్కు నిషాంత్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. జగిత్యాల -ధర్మారం ప్రధాన రహదారిపై స్థానిక బస్టాండ్ లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు అనుకూలంగా నినాదాలు చేస్తూ కేకులు కట్ చేసి , స్వీట్లు పంపిణీ చేసుకొని టపాసులు పేలుస్తూ, నృత్యాలు చేస్తూ చేసుకున్న సంబరాలు అంబరానంటాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు సత్యనారాయణ గౌడ్, ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్, పట్టణ శాఖ అధ్యక్షులు నేరెల్ల మహేష్, నాయకులు చెవుల మద్ది విక్రం, కచ్చు మల్లయ్య, వినోద్ ,కొమురయ్య, వీరేశం, సత్తయ్య, గంగన్న మల్లయ్య, విజయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో సారి మందు తాగి పట్టుబడ్డ వాహన దారుడు

### రెండు రోజుల జైలు శిక్ష విధించిన న్యాయమూర్తి

**జగిత్యాల డిసెంబర్ 15 (ప్రజామంటలు):** మద్యం సేవించి వాహనం రెండో సారి పట్టుబడ్డ వ్యక్తిని స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గంప కరుణాకర్ నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష విధించిన సంఘటన శుక్రవారం జగిత్యాలలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఈ నెల 4 న జగిత్యాల లో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించిన కుడిసెల తిరుపతి పట్టుబడ్డారు. గతంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించిన తిరుపతి పట్టుబడగ కౌన్సిలింగ్ ఇచ్చి వదిలిపెట్టినట్లు ట్రాఫిక్ ఎస్.ఐ. రామచంద్రము పేర్కొన్నారు. రెండోసారి పట్టుబడ్డ తిరుపతిని జగిత్యాల స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ న్యాయమూర్తి గంప కరుణాకర్ ముందు హాజరుపరుచగా రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఎస్.ఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్.ఐ. రామచంద్రము మాట్లాడుతూ తొలిసారి తాగి పట్టుబడ్డ వారికి కాన్సిలింగ్ ఇచ్చి వదిలిపెట్టినట్లు పేర్కొన్నారు. రెండవసారి మందుతాగి పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడంతోపాటు జైలు శిక్ష విధించబడుతుందని ఎస్.ఐ. పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడి కోర్టుకు రాకుండా తప్పించుకుని తిరుగుతున్న వారందరినీ త్వరలో పట్టుకొని కోర్టులో హాజరు పరుస్తామని ట్రాఫిక్ ఎస్.ఐ. పేర్కొన్నారు.

## రాక్షస రాజాగా రానా



పవర్‌హౌస్ యాక్టర్ రానా, క్రియేటివ్ డైరెక్టర్ తేజ కాంబినేషన్‌లో వచ్చిన ‘నేనే రాజు నేనే మంత్రి‘ బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ‘రాక్షస రాజా‘తో మరోసారి ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. ఇదివరకూ ఎన్నడూ చూడని క్రైమ్ వరల్డ్‌ని ఎక్స్‌ప్లోర్ చేస్తూ ఇంటెన్స్ ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామా అద్భుతమైన సమ్మేళనంగా ఈ సినిమా ఉండనుంది. రానా పుట్టినరోజు సందర్భంగా ఈ టైటిల్‌ను పవర్ ఫుల్ పోస్టర్ ద్వారా ప్రకటించారు. ఇందులో రానా తన భుజంపై భారీ తుపాకీని పట్టుకుని మరో భుజంపై బుల్లెట్లతో కనిపించారు. విభూతి, తిలకం ధరించి, నోటిలో సిగార్‌తో వైల్డ్‌గా కనిపించారు. వేళ్లకు రెండు పొడవాటి బంగారు ఉంగరాలు ఉన్నాయి. ఓవరాల్‌గా రానా లుక్ అద్భుతంగా అలరిస్తోంది. ఈ గ్యాంగ్‌స్టర్ చిత్రంలో మునుపెన్నడూ లేని విధంగా సినిమాటిక్ జర్నీని ప్రేక్షకులు ఆశించవచ్చు.

## ప్రభుత్వ విప్‌గా ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మన్ కుమార్

### కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సంబరాలు





**ధర్మపురి డిసెంబర్ 15 (ప్రజామంటలు):** ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మన్ కుమార్ ను ప్రభుత్వ విప్ గా నియమించడంతో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయా మండలాల్లో సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రం వెల్గటూర్ లో బాణాసంచా పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెరుగు మురళి గౌడ్, ఉపసర్పంచ్, సందీప్ రెడ్డి, నాయకులు గంద్ర శ్రీకాంత్ రావు, రాందేని కోటయ్య, మెరుగు నరేశ్, బందెల ఉదయ్, వెంకటేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన డైట్ నిర్వాహకులు



**సికింద్రాబాద్ డిసెంబర్ 15 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ను శుక్రవారం శ్రీవెంకటేశ్వర అసోసియేషన్ మేనేజింగ్ డైరెక్టర్, గాంధీ ఆసుపత్రి డైట్ నిర్వాహకులు కె. రవికుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకేను డిప్యూటీ సీఎం కు అందచేసిన రవికుమార్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో రాష్ట్రం గొప్పగా అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ను కలుసుకున్న రవికుమార్ శాలువాతో మంత్రిని సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. రవికుమార్ వెంట గాంధీ ఆసుపత్రి సెక్యూరిటీ, శానిటేషన్ ప్రతినిధులు శివాజీ, కార్తీక్ లు ఉన్నారు.

## టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మెన్ మధుయాష్కీ గౌడ్ జన్మదిన వేడుకలు

### కేక్ కట్ చేసి కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



**జగిత్యాల డిసెంబర్ 15 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో జగిత్యాల కాంగ్రెస్ నాయకులు తాటిపర్తి రాం చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మధుయాష్కి గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, సంబురాలు నిర్వహించారు. మధుయాష్కీ నాయకత్వం వర్ధిల్లాలి అని నినాదాలు చేశారు. కేక్ తినిపించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మధుయాష్కీ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. సోనియా గాంధీ నాయకత్వం లో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ని కేంద్రం లో అధికారంలోకి తీసుకు వచ్చేందుకు అందరూ కృషి చేయాలని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న మధు యాష్కీ గౌడ్ ఉన్నత స్థానంలో ఉండాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు గిరి నాగభూషణం, బండ శంకర్, రఘువీర్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త మోహన్ , జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండ మధు, కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మరియు యూత్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మవారిని ఆరాధిస్తూ భక్తిమార్గంలో నడవాలి

### ఆలయ ఫౌండరీ ట్రస్టీ ఛైర్మన్ స్వరూప

### పొలాస ఆలయంలో లలిత సహస్ర నామ పారాయణం



**జగిత్యాల డిసెంబర్ 15 (ప్రజామంటలు):** ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలకు విలువ లేకుండా పోయిన సందర్భంలో ప్రతి ఒక్కరు లలిత అమ్మవారిని ఆరాధించి భక్తిమార్గంలో పయనించాలని 108 శ్రీచక్ర లలితా మాత ఆలయ ఫౌండరీ ట్రస్టీ ఛైర్మన్ చెల్లం స్వరూప అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని 108 శ్రీచక్ర సహిత లలిత మత ఆల యంలో శుక్రవారం మహిళలు లలిత సహస్రనామ స్తోత్ర పారాయణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఫౌండరీ ట్రస్టీ ఛైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య ఆధ్వర్యంలో శుక్ర వారం దేవాలయంలో ఉదయం 11 గంటలకు ఆలయంలో ప్రతిష్టించిన 108 శ్రీ చక్రాలకు సుహాసినిలు కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులకు అన్నదానం చేశారు.

## జగిత్యాల పట్టణము పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

**జగిత్యాల టౌన్ డిసెంబర్ 15 (ప్రజామంటలు):** 16న ఉ. 9:30 గం.ల నుండి మ. 12:30 గం.ల వరకు 33/11 కె.వి. ధరూర్ క్యాంప్ సబ్ స్టేషన్ మరమ్మతుల మరియు న్యూ 33 కె.వి. లైన్ ఎరాక్షన్ దృశ్యా భవానినగర్, ఎమ్మెల్యే క్వార్టర్స్, కలెక్టర్ రెసిడెన్సు, కరీంనగర్ రోడ్, క్యాంప్ రామాలయం ఏరియా, ధరూర్ క్యాంపు, చర్చి ఏరియా, అయ్యప్ప కాలనీ, బుడగజంగాల కాలనీ, పద్మనాయక వెనుక, హైటెక్ కాలనీ, శాంతి నగర్ , అంతర్గాం రోడ్,గణేష్ నగర్ లలో కరెంట్ సప్లై నిలిపి వేయబడును. కావున వినియోగదారులు సహకరించగలరని ఎండి రహీం ఏ ఏ ఈ టౌన్ - 3 కోరారు.

prajamantalau daily pages (16-12)_times of varha main (13-2).qxd 12/16/2023 5:14 AM Page 6



## బబుల్‌గమ్ ట్రైలర్ లాంచ్



పాపులర్ యాంకర్ సుమ కనకాల కుమారుడు రోషన్ కనకాల హీరోగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం బబుల్‌గమ్ . రవికాంత్ పేరెపు దర్శకత్వంలో వస్తోన్న ఈ చిత్రంలో మానస చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే లాంఛ్ చేసిన బబుల్‌గమ్ ఫ్రీ లుక్ పోస్టర్, సాంగ్స్, టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ముందుగా అందించిన అప్‌డేట్ ప్రకారం బబుల్‌గమ్ ట్రైలర్‌ను లాంఛ్ చేశారు. నా డెస్టినీలో ఏం రాసిపెట్టిందో నాకు తెల్వదు. కానీ నచ్చినట్టు మార్చుకుంటా.. కావాల్సింది లాక్కొని తెచ్చుకుంటా.. అంటూ హీరో చెప్పే డైలాగ్స్ షురూ అయింది ట్రైలర్. ఎవడు పడితే వాడు చేతులేశాడనుకో.. చేతులు నరికేస్తానంటున్నాడు రోషన్. హీరోహీరోయిన్ల డిఫరెంట్ లవ్ ట్రాక్‌తో సాగుతున్న ట్రైలర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ప్రేమ బబుల్ గమ్ లాంటిది.. మొదట్ల తీయగుంటది.. తర్వాత అంటుకుంటది.. షూస్ కింద, థియేటర్లల్ల సీట్ల కింద అంత ఈజీ కాదురరేయ్ పండవెట్టేస్తది.. అంటూ సాగే డైలాగ్స్‌తో సాగుతున్న బబుల్ గమ్ టీజర్ సినిమాపై అంచనాలు పెంచుతోంది. బబుల్‌గమ్‌లో ఫ్రీ లుక్ పోస్టర్‌లో హీరోహీరోయిన్లు సూపర్ రొమాంటిక్ మూడ్‌లో సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తుండగా.. సురేశ్ రగుతు సినిమాటోగ్రాఫర్. క్షణం, కృష్ణ అండ్ హిజ్ లీల సినిమాల తర్వాత రవికాంత్ పేరెపు దర్శకత్వంలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు బాగానే ఉన్నాయి. ఈ చిత్రం డిసెంబర్ 29న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ-మహేశ్వరి మూవీస్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి.

# గుంటూరు కారం సినిమా పాట రగడ

### రామజోగయ్యను ఆడుకున్న నెటిజన్లు




సూపర్ స్టార్ మహేష్ బాబు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తోన్న సినిమా 'గుంటూరు కారం' సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.సంక్రాంతి బరిలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ప్రస్తుతం మేకర్స్ ప్రమోషన్స్‌ని కూడా మొదలెట్టారు. ఊహించని విధంగా షూటింగ్ జరుపుకున్న ఈ సినిమా.. సంక్రాంతికి రావడం పక్కా అనేలా సిద్ధమవుతోంది. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించి విడుదలైన సెకండ్ సింగిల్ మాత్రం.. భారీగా ట్రోలింగ్‌కు గురవుతోంది. 'గుంటూరు కారం'కు సంబంధించి మొదట విడుదలైన 'థమ్ మసాలా' సాంగ్ అందరినీ అలరించింది. అదే ఊపులో సెకండ్ సింగిల్‌కు సంబంధించి విడుదలకు ముందు చేసిన హడావుడి.. సాంగ్‌పై భారీగా అంచనాలను పెంచేసింది. తీరా.. సాంగ్ విడుదలైన తర్వాత ఫ్యాన్స్ అంతా నిరాశకు లోనవుతున్నారు. అందుకు కారణం.. విడుదలకు ముందు చేసిన హడావుడంత గొప్పగా లేకపోవడమే. థమన్ మ్యూజిక్, రామజోగయ్య శాస్త్రి సాహిత్యం.. ఏదీ ఫ్యాన్స్‌కు నచ్చలేదు. అంతే సోషల్ మీడియా వేదికగా.. థమన్‌ని, రామ్‌జోని ఫ్యాన్స్ ట్రోలింగ్ మొదలెట్టారు. ఈ ట్రోలింగ్‌పై అసహనం వ్యక్తం చేసిన రామజోగయ్య శాస్త్రిని మరింతగా ఫ్యాన్స్ టార్గెట్ చేయడంతో చేసేది లేక.. ట్విట్టర్‌కు రామజోగయ్య బై బై చెప్పేశారు. వాస్తవానికి 'ఓ మై బేబీ' అంటూ మహేష్ బాబు, శ్రీలీల మధ్య వచ్చిన ఈ పాటలో.. సూపర్ స్టార్ గత సినిమాలకు లింక్ అయ్యేలా రామజోగయ్య సాహిత్యాన్ని అల్లారు. కానీ ట్యూన్ క్యాచీగా లేకపోవడంతో.. లిరిక్స్ కూడా పెద్దగా శ్రోతలకు ఎక్కలేదు. . అసలు ఇది పాటే నా ఏం ఊహించుకుని రాస్తున్నారు.. ఆ ఇంగ్లీష్ పదాలేంటి? హీరో ఎవరని అనుకుంటున్నారు ఇంత చెత్త పాట ఇంత వరకు వినలేదు అంటూ ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా భగ్గుమన్నారు. ఫ్యాన్స్ చేస్తున్న ట్రోలింగ్‌పై స్పందించిన రామజోగయ్య శాస్త్రి.. ప్రతివాడూ మాట్లాడే వాడే... రాయి విసిరే వాడే. అభిప్రాయం చెప్పేదానికి ఒక పద్ధతి ఉంటుంది.

పాట నిడివి తప్ప నిన్నటి పాటకు ఏం తక్కువైందని.. మీకన్నా ఎక్కువ ప్రేమే మాక్కూడా.. అదే లేకపోతే, ప్రేమించకపోతే మా పని మేం గొప్పగా చెయ్యలేం... తెలుసుకుని ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడండి అంటూ ఫ్యాన్స్‌కి వార్నింగ్ ఇచ్చినట్లుగా ట్విట్టర్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. రామజోగయ్య శాస్త్రిపై నెటిజన్లు ఒక రకంగా యుద్ధమే మొదలెట్టారు. ఈ యుద్ధాన్ని తట్టుకోవడం రామ్‌జో వల్ల కాలేదు. అందుకే 'మీకో దండంరా నాయనా' అనేలా ట్విట్టర్ అకౌంట్ మూసేసి.. ముగింపు పలికారు.

## నా 21 ఏళ్ల కెరీర్‌లో బెస్ట్ డైరెక్టర్

### ప్రశాంత్ నీల్‌పై ప్రభాస్ కామెంట్స్



గ్లోబల్ స్టార్ హీరో ప్రభాస్ కాంపౌండ్ నుంచి వస్తున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ సలార్ యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీకి కేజీఎఫ్ ఫేం ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నాడు. సలార్ రెండు పార్టులుగా రానుండగా.. తొలిపార్ట్ డిసెంబర్ 22న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. రిలీజ్ డేట్ తేదీ పడుతున్న నేపథ్యంలో ఏదో ఒక అప్‌డేట్ ఇస్తూ అభిమానులను ఖుషీ చేస్తున్నారు మేకర్స్. సలార్ మరో వారంలో సందడి చేయనుండటంతో ప్రభాస్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు తెగ వైరల్ అవుతున్నాయి. కేజీఎఫ్ డైరెక్టర్ గురించి మాట్లాడుతూ..ప్రశాంత్ నీల్ నా 21 ఏండ్ల కెరీర్‌లో ఉత్తమ డైరెక్టర్ అని చెప్పుకొచ్చాడు. గత 21 ఏండ్లలో నాకు ఒక్కసారి కూడా ఇలాంటి ఆలోచన రాలేదు. కేవలం నెలలోనే మేమిద్దరం చాలా క్లోజ్ అయ్యాం. ప్రశాంత్‌నీల్‌తో భారీ కమర్షియల్ సినిమా చేస్తున్నానని చెప్పాడు ప్రభాస్. ఇటీవలే సలార్ ఫస్ట్ సింగిల్ సూరీడే లిరికల్ వీడియో సాంగ్‌ను లాంఛ్ చేశారు మేకర్స్. సూరీడే గొడుగు పట్టి.. వచ్చాడే భుజం తట్టి చిమ్మ చీకటిలో నీడలా ఉండెటోడు.. అంటూ సాగుతున్న ఈ పాట సలార్, వరద రాజ మన్నార్ స్నేహం నేపథ్యంలో సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసిన సూరీడే లిరికల్ వీడియో సాంగ్ నెట్టింట వ్యూస్ పంట పండిస్తూ.. టాక్ ఆఫ్ ది టౌన్ నిలుస్తోంది. సలార్‌లో శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. జగపతిబాబు, బాబీ సింహా, ఈశ్వరీ రావు, శ్రియారెడ్డి, జాన్ విజయ్, సప్తగిరి, సిమ్రత్ కౌర్, పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## సలార్‌లో ఆసక్తి కలిగిస్తున్న

# జాంబీ ఫైట్..




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం సలార్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రానున్న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 22న విడుదల కానుంది. మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇక ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమా నుంచి ఒక సాలిడ్ రూమర్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో ఒక జాంబీ ఫైట్ ఉందని తెలుస్తుంది. వందలాది జాంబీలు మూకుమ్మడిగా కలిసి దేవ మీద దాడి చేస్తే.. వాటిని ప్రభాస్ ఊచకోత కోస్తాడని.. ఈ ఒక్క సీక్వెన్స్ సలార్ సినిమాకే హైలెట్‌గా ఉంటుందని ఈ మూవీకి డబ్బింగ్ చెప్పిన టాలీవుడ్ సీనియర్ నటుడు తెలిపాడు. దీంతో అసలు ప్రశాంత్ నీల్ ఏం ప్లాన్ చేశాడో అన్న ఊహే గూస్ బంప్స్ తెప్పిస్తుంది. ఇక ఈ సీన్ వల్లే సినిమాకు ఎ సర్టిఫికేట్ వచ్చినట్లు సమాచారం. ఇక దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతుంది. మరోవైపు ఇటీవలే సలార్ ఫస్ట్ సింగిల్ సూరీడే లిరికల్ వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే. సూరీడే గొడుగు పట్టి.. వచ్చాడే భుజం తట్టి చిమ్మ చీకటిలో నీడలా ఉండెటోడు.. అంటూ సాగుతున్న ఈ పాట సలార్, వరద రాజ మన్నార్ స్నేహం నేపథ్యంలో సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసిన సూరీడే లిరికల్ వీడియో సాంగ్ నెట్టింట వ్యూస్ పంట పండిస్తూ.. టాక్ ఆఫ్ ది టౌన్ నిలుస్తోంది. సలార్‌లో శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. జగపతి బాబు, బాబీ సింహా, ఈశ్వరీ రావు, శ్రియారెడ్డి, జాన్ విజయ్, సప్తగిరి, సిమ్రత్ కౌర్, పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. సలార్‌లో శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. జగపతిబాబు, బాబీ సింహా, ఈశ్వరీ రావు, శ్రియారెడ్డి, జాన్ విజయ్, సప్తగిరి, సిమ్రత్ కౌర్, పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## తెలుగులో హిట్టు కొడుతున్నా

### పరభాషల్లో పట్టు సాధించని నాని



నేచురల్ స్టార్ నాని ఈ మధ్యకాలంలో సినిమా సినిమాకి వ్యత్యాసం చూపిస్తూ కొత్త కథలతో వరుస సక్సెస్ లు అందుకుంటున్నాడు. అతని కెరియర్ పరంగా చూసుకున్న ఫెయిల్యూర్స్ చాలా తక్కువ ఉంటాయి. దీనికి కారణం ఎక్కువగా యూత్, ఫ్యామిలీ ఆడియన్స్ కి కనెక్ట్ అయ్యే కథలని ఎంపిక చేసుకోవడమే. రీసెంట్ గా హాయ్ నాన్న సినిమాతో మరో హిట్ ని నాని తన ఖాతాలో వేసుకున్నాడు. నాని శ్యామ్ సింగరాయ్, అంటే సుందరానికి, దసరా, హాయ్ నాన్న సినిమాలు తెలుగుతో పాటు ఇతర భాషలలో కూడా రిలీజ్ అవుతున్నాయి. అయితే తెలుగులో సక్సెస్ అందుకొని ప్రేక్షకులని మెప్పిస్తొన్న ఈ సినిమాలు ఇతర భాషలలో మాత్రం ఆశించిన స్థాయిలో రీచ్ కావడం లేదు. ప్రమోషన్స్ గట్టిగానే చేస్తోన్న ప్రేక్షకులని థియేటర్స్ వరకు రప్పించుకోలేకపోతున్నాడు. దీనికి భిన్నంగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ మాత్రం తన ఫ్లాప్ సినిమాలతో కూడా ఇతర భాషలలోకి బాగా రీచ్ అయ్యాడు. ఒకప్పుడు నాని హీరోగా చేసిన ఎవడే సుబ్రహ్మణ్యం సినిమాలో విజయ్ దేవరకొండ ఫ్రెండ్ పాత్రలో నటించిన విషయం తెలిసిందే. ఇక విజయ్ గీతాగోవిందం సినిమా తెలుగుతో పాటు తమిళంలో కూడా మంచి హిట్ అయ్యింది. డియర్ కామ్రేడ్ తెలుగు, తమిళ్ భాషలలో రిలీజ్ చేశారు. పర్వాలేదనే టాక్ తెచ్చుకుంది. లైగర్ సినిమాతో పాన్ ఇండియా లెవల్ లో ట్రై చేశాడు. ఈ సినిమా ప్రమోషన్స్ టైం లోనే విజయ్ కి నార్త్ ఆడియన్స్ నుంచి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. దానికి తగ్గట్లుగానే మూవీకి కూడా సాలిడ్ ఓపెనింగ్స్ వచ్చాయి. అయితే కథ సరిగా లేకపోవడం వలన సక్సెస్ రాలేదు. ఖుషి మూవీ కూడా తెలుగుతో పాటు మరో నాలుగు భాషలలో రిలీజ్ అయ్యింది. తమిళంలో ఈ సినిమా సూపర్ హిట్ అయ్యింది. మిగిలిన భాషలలో అంత ప్రభావం చూపించలేదు. ఫ్లాప్ అయిన కూడా ఈ సినిమా మంచి వసూళ్లు రాబట్టింది. దీనిని బట్టి నానితో పోల్చుకుంటే విజయ్ దేవరకొండకి ఇతర భాషలలో కూడా మంచి మార్కెట్ ఉంది. సరైన హిట్ పడితే కలెక్షన్స్ లో ఆ పభావం కనిపించే అవకాశం ఉండేది.

## మహేంద్ర సింగ్ ధోనీపై ఫిక్సింగ్ ఆరోపణలు..

### ఐపీఎస్ అధికారికి 15 రోజుల జైలు శిక్ష



ఐపీఎల్ 2013 బెట్టింగ్ స్కాండల్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ స్కామ్ కారణంగానే చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లపై నిషేధం కూడా విధించారు. అయితే ఇదే స్కామ్‌కు సంబంధించి అప్పట్లో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ జట్టు కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీపై రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జీ సంపత్ కుమార్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. ధోని 2013 ఐపీఎల్ సమయంలో బెట్టింగ్, మ్యాచ్ ఫిక్సింగ్‌లకు పాల్పడ్డాడంటూ సంచలన ఆరోపణలు చేశారు సంపత్ కుమార్ . దీంతో ధోని కోర్టును ఆశ్రయించారు. పరువు నష్టం దావా వేశాడు. తాజాగా ఈ కేసును విచారించిన మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జీ సంపత్ కు 15 రోజుల జైలు శిక్ష విధించింది. ఈ మేరకు శుక్రవారం జస్టిస్ ఎస్ఎస్ సుందర్, జస్టిస్ సుందర్ మోహన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం (డిసెంబర్ 15) తీర్పును వెలువరించింది. అయితే ఈ 15 రోజుల శిక్షపై అప్పీలు చేసుకోవడానికి సంపత్ కుమార్‌కు 30 రోజుల గడువు ఇచ్చింది. ఇదే విషయమై గతంలో కొన్ని మీడియా సంస్థలు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సంపత్ కుమార్ తదితరులపై ధోనీ హైకోర్టులో పరువు నష్టం దావా వేశారు. 2013 ఐపీఎల్ సమయంలో బెట్టింగ్, మ్యాచ్ ఫిక్సింగ్‌లకు పాల్పడ్డాడంటూ తనపై దురుద్దేశపూర్వకమైన ప్రకటనలు, నివేదికలు ఇచ్చారని ధోని కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసులో సంపత్ కుమార్ తదితరులు తనపై తప్పుడు ప్రకటనలు చేయకుండా లేదా ప్రచురించకుండా అడ్డుకోవాలని ధోనీ విజ్ఞప్తి చేశాడు. ఈ కేసును విచారించిన హైకోర్టు, ధోనీపై పరువు నష్టం కలిగించే ప్రకటనలు ఇవ్వకుండా మీడియా సంస్థలు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సంపత్ కుమార్ తదితరులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అందరూ కోర్టు ఆదేశాలను ఫాలో అయ్యారు. అయితే కోర్టు తీర్పు వెలువరించిన తర్వాత కూడా బెట్టింగ్ స్కామ్ కేసుకు సంబంధించి రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సంపత్ కుమార్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధోనీ కోర్టును ఆశ్రయించాడు. ఇప్పుడు ఈ కేసుకు సంబంధించి హైకోర్టు తీర్పు వెలువరించింది. రిటైర్డ్ ఐపిఎస్ అధికారికి 15 రోజుల జైలు శిక్ష విధించింది.

## 136 పరుగులకే ఇంగ్లీష్ బ్యాటర్లు ఆలౌట్



ముంబై వేదికగా ఇంగ్లండ్ మహిళల జట్టుతో జరుగుతున్న ఏకైక టెస్ట్‌లో టీమిండియా మహిళా టీమ్ పట్టు బిగుస్తుంది. భారత అమ్మాయిలు తలో చేయి వేయడంతో తొలి ఇన్నింగ్స్‌లో 428 పరుగుల భారీ స్కోర్ చేసింది. లక్ష్య ఛేదనలో బ్యాటింగ్ కు దిగిన ఇంగ్లాండ్ బ్యాటర్లు 138 పరుగులకే ఆలౌట్ చేసి 292 రన్స్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం టీమిండియా పొందింది. దీప్తి శర్మ టెస్ట్‌ల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి (5.3-4-7-5) ఇంగ్లీష్ జట్టు పతనాన్ని శాశించింది. ఇక, దీప్తికి స్నేహ్ రాణా 2 వికెట్లు తీయగా, రేణుక సింగ్, పూజా వస్త్రాకర్ తలో వికెట్ తీసుకున్నారు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో నాట్ సీవర్ బ్రంట్ (59) హాఫ్ సెంచరీ మాత్రమే టాప్ స్కోర్‌గా నిలిచింది. మిగతా బ్యాటర్లంతా కనీసం 20 రన్స్ మార్క్ ను కూడా దాటలేకపోయారు. ఆమీ జోన్స్ 12, బేమౌంట్ 10, డంక్లీ 11, హీథర్ నైట్ 11, డేనియెల్ వ్యాట్ 19 రన్స్ చేయగా.. లారెన్ ఫైలర్ 5, కేట్ క్రాస్ ఒకటి, ఎక్లెస్టోన్, చార్లీ డీన్ డకౌట్ అయ్యారు. ఆ తర్వాత సెకెండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన టీమిండియా 14 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 69 రన్స్ చేసింది. ప్రస్తుతం భారత జట్టు ఓవరాల్‌గా 361 పరుగుల లీడ్‌ను సాధించింది. స్మృతి మంధన 26 రన్స్ చేసి ఔట్ కాగా.. షఫాలీ వర్మ (32), యస్తిక భాటియా (7) ప్రస్తుతం క్రీజ్‌లో ఉన్నారు. అయితే, అంతకు ముందు శుభ సతీశ్, జెమీమా రోడ్రిగెజ్, యస్తికా భాటియా, దీప్తి శర్మ అర్ధ శతకాలతో తొలి ఇన్సింగ్స్ లో రెచ్చిపోయి బ్యాటింగ్ చేశారు. కాగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (49), స్నేహ్ రాణా (30) రాణించడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో లారెన్ బెల్, సోఫీ ఎక్లెస్టోన్ తలో 3 వికెట్లు తీసుకోగా.. కేట్ క్రాస్, నాట్ సీవర్ బ్రంట్, చార్లెట్ డీన్ ఒక్కో వికెట్ తీసుకున్నారు.

prajamantalau daily pages (16-12)_times of varha main (13-2).qxd 12/16/2023 5:14 AM Page 7



## బ్యాటింగ్ విభాగంలో కాస్త

# సమతూకంగా కేకేఆర్




ఐపీఎల్ 2024 వేలం కోసం కోల్‌కతా ఫ్రాంచైజీ సిద్ధమవుతోంది. వేలంలో ఎక్కువ సంఖ్యలో ఆటగాళ్లను కొనుగోలు చేయాలనే ఒత్తిడిలో కేకేఆర్ ఫ్రాంచైజీ ఉంది. ఇతర జట్లు 6 నుంచి 8 మంది ఆటగాళ్లు కావాల్సి ఉండగా, కోల్‌కతా నైట్ రైడర్స్ టీం మాత్రం ఏకంగా 12 మంది ఆటగాళ్లను ఎంచుకోవాల్సి ఉంది. ఈ ఖాళీ స్లాట్‌లను భర్తీ చేసేందుకు కేకేఆర్ వద్ద పర్స్‌లో రూ. 32.7 కోట్లు మాత్రమే ఉన్నాయి. ఈసారి కోల్‌కతా ఫ్రాంచైజీ తన జట్టు నుంచి మొత్తం 12 మంది ఆటగాళ్లను విడుదల చేసింది. వీరిలో అత్యధిక సంఖ్యలో ఫాస్ట్ బౌలర్లు ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేకేఆర్ ఈ వేలంలో ఎక్కువ మంది ఫాస్ట్ బౌలర్లను టార్గెట్ చేయాల్సి ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తన జట్టు నుంచి లాకీ ఫెర్గూసన్, శార్దూల్ ఠాకూర్, టిమ్ సౌథీ, ఉమేష్ యాదవ్ వంటి స్టార్ ఫాస్ట్ బౌలర్లను తొలగించింది. ప్రస్తుతం జట్టులో ఆండ్రీ రస్సెల్, వైభవ్ అరోరా తప్ప మంచి ఫాస్ట్ బౌలర్ లేడు. ఇలాంటి పరిస్థితుల్లో డిసెంబర్ 19న జరిగే వేలంలో కనీసం నలుగురైదుగురు స్పెషలిస్ట్ ఫాస్ట్ బౌలర్లను జట్టులో చేర్చుకోవాల్సిన ఒత్తిడి కేకేఆర్ ఫ్రాంచైజీపై నిలిచింది. ఇక్కడ మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, గుస్ అట్కిన్సన్, గెరాల్డ్ కోయెట్జీ, డేవిడ్ విల్లీ, క్రిస్ వోక్స్ వంటి విదేశీ ఫాస్ట్ బౌలర్లపై దృష్టి పెట్టవచ్చు. జట్టులో ఇద్దరు, ముగ్గురు భారత ఫాస్ట్ బౌలర్లను కూడా చేర్చుకోవాల్సి ఉంటుంది. హర్షల్ పటేల్ లాంటి బౌలర్లను ఈ లిస్టులో ఉండొచ్చు.బ్యాటింగ్ విభాగంలో కేకేఆర్ కాస్త సమతూకంగా కనిపిస్తున్నాడు. అయితే, ఇక్కడ కూడా ఒకరిద్దరు స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్స్ కొరత ఉంది. ఇటువంటి పరిస్థితిలో, కోల్‌కతా ఫ్రాంచైజీ వేలంలో కొంతమంది మంచి బ్యాట్స్‌మెన్స్‌పై కూడా దృష్టి సారించాల్సి ఉంటుంది. ఇక్కడ, విదేశీ బ్యాట్స్‌మెన్‌లలో ఒకటి లేదా ఇద్దరు కీలక పేర్లను లక్ష్యంగా చేసుకుని, వేలంలోకి అడుగుపెట్టే వీలుంది. రిటైన్ చేసిన ఆటగాళ్ల జాబితా: నితీష్ రాణా, రింకూ సింగ్, రహ్మానుల్లా గుర్బాజ్, శ్రేయాస్ అయ్యర్, ఆండ్రీ రస్సెల్, వెంకటేష్ అయ్యర్, అనుకూల్ రాయ్, సునీల్ నరైన్, వైభవ్ అరోరా, హర్షిత్ రానా, సుయాష్ శర్మ, వరుణ్ చక్రవర్తి, జాసన్ రాయ్.
రిలీజ్ చేసిన ఆటగాళ్ల జాబితా: షకీబ్ అల్ హసన్, లిటన్ దాస్, ఆర్య దేశాయ్, నారాయణ్ జగదీసన్, మన్‌దీప్ సింగ్, కుల్వంత్ ఖేజ్రోలియా, శార్దూల్ ఠాకూర్, లాకీ ఫెర్గూసన్, ఉమేష్ యాదవ్, టిమ్ సౌతీ, జాన్సన్ చార్లెస్ , డేవిడ్ విస్.

# అత్యంత ఖరీదైన ఆటగాడు, కామెరాన్ గ్రీన్..




ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నట్లు వినిపిస్తున్నాయి. '7 క్రికెట్' కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో గ్రీన్ మాట్లాడుతూ, తాను పుట్టినప్పటి నుంచి తీవ్రమైన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నానని పేర్కొన్నాడు. మా అమ్మ 19వ వారం ప్రెగ్నెన్సీ స్కాన్ సమయంలో నాకు ఈ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయింది' అంటూ తెలిపాడు. 'నాకు ఈ వ్యాధి లక్షణాలు లేవు. కానీ, నేను అల్ట్రాసౌండ్ ద్వారా ఈ వ్యాధిని గుర్తించాను. నేను 12 ఏళ్లు మాత్రమే జీవించగలనని వైద్యులు మొదట్లో చెప్పారు. కానీ, నేను నా ఆహారాన్ని అలాగే నా కెరీర్‌ను మార్చుకున్నాను. ఇది నా జీవితాన్ని మరింత పొడిగించింది' అంటూ షాక్ ఇచ్చాడు. 'నా కిడ్నీలు ఇతర కిడ్నీల మాదిరిగా శరీరంలో రక్తాన్ని ఫిల్టర్ చేయవు. ఇవి 60 శాతం రక్తాన్ని మాత్రమే ఫిల్టర్ చేయగలవు. ప్రస్తుతం ఈ వ్యాధి రెండో దశలో ఉంది. ఇది ఐదవ దశకు చేరుకున్నప్పుడు, నేను కిడ్నీ మార్పిడి లేదా డయాలసిస్ చేయించుకోవలసి ఉంటుంది' అంటూ తెలిపాడు. గ్రీన్ ఐపీఎల్ కెరీర్ గురించి మాట్లాడితే.. గత ఐపీఎల్ వేలంలో గ్రీన్‌ను ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ రూ. 17.50 కోట్లకు కొనుగోలు చేసింది. కానీ, ఈ ఎడిషన్‌లో ముంబైకి చెందిన

జట్టు గ్రీన్‌ని దక్కించుకుంది. కాగా, గ్రీన్ ఐపీఎల్ 2023లో 16 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో అతను 50.22 సగటు, 160.28 స్ట్రైక్ రేట్‌తో 452 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, రెండు అర్ధ సెంచరీలు ఉన్నాయి.ఫాఫ్ డు ప్లెసిస్ (కెప్టెన్), గ్లెన్ మాక్స్‌వెల్, విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్, అనుజ్ రావత్, దినేష్ కార్తీక్, సుయాష్ ప్రభుదేసాయి, విల్ జాక్స్, మహిపాల్ లోమ్రోర్, కర్ణ్ శర్మ, మనోజ్ భాండాగే, మయాంక్ డాగర్ ( నుంచి), విజయ్‌కుమార్ వైషాక్, ఆకాష్ దీప్, మహమ్మద్ సిరాజ్, రీస్ టాప్లీ, హిమాన్షు శర్మ, రాజన్ కుమార్, కామెరాన్ గ్రీన్ (నుంచి).

### రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీం విడుదల చేసిన ఆటగాళ్లు..

వనిందు హసరంగా, హర్షల్ పటేల్, జోష్ హేజిల్‌వుడ్, ఫిన్ అలెన్, మైకేల్ బ్రేస్‌వెల్, డేవిడ్ విల్లీ, వేన్ పార్నెల్, సోనూ యాదవ్, అవినాష్ సింగ్, సిద్ధార్థ్ కౌల్, కేదార్ జాదవ్.

## ఏడో నెంబర్ జెర్సీకి రిటైర్మెంట్!




భారత క్రికెట్ జట్టులో మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీది ప్రత్యేక స్థానం. బ్యాటర్, వికెట్ కీపర్‌గానే కాకుండా.. కెప్టెన్‌గా తనదైన ముద్ర వేశాడు. 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్ సహా 2013 ఛాంపియన్ ట్రోఫీని భారత జట్టుకు ధోనీ అందించాడు. మూడు ఐసీసీ ట్రోఫీలు సాధించిన ఏకైక కెప్టెన్‌గా ధోనీ అరుదైన రికార్డు నెలకొల్పాడు. ప్రపంచ అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా కొనసాగిన మహీ.. 2019లో అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ఇచ్చాడు. భారత జట్టుకు ఎంతో సేవ చేసిన ధోనీ గౌరవార్థం బీసీసీఐ ఓ కీలక నిర్ణయం తీసుకుంది.ఎంఎస్ ధోనీ 'జెర్సీ నంబర్ 7'కి రిటైర్ ఇవ్వాలని బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. ఈ జెర్సీ ధరించి భారత క్రికెటర్ ఎవరూ ఇకపై అంతర్జాతీయ క్రికెట్ ఆడరు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ 'జెర్సీ నంబర్ 10'కి బీసీసీఐ గతంలో రిటైర్ ఇచ్చిన విషయం తెలిసిందే. జెర్సీ నంబర్ 10 తర్వాత ఇప్పుడు జెర్సీ నంబర్ 7కు బీసీసీఐ రిటైర్ ఇచ్చింది. భారత క్రికెట్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా.. ఎంఎస్ ధోనీకి ఈ అరుదైన గౌరవం ఇచ్చినట్లు బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు.

## పుట్టినరోజున చరిత్ర సృష్టించిన చైనామన్



తన 29వ పుట్టినరోజున కుల్దీప్ ఐదు వికెట్లు తీయడం ప్రత్యేకమైనది. ఈ స్పెషల్ రికార్డ్‌తో తన పుట్టినరోజు నాడు 3 వికెట్లు తీసిన టీమిండియా మాజీ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ రికార్డును కుల్దీప్ బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో కుల్దీప్ యాదవ్ 2.5 ఓవర్లు బౌలింగ్ చేసి 17 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో పాటు అంతర్జాతీయ టీ20లో రెండుసార్లు ఐదు వికెట్లు పడగొట్టిన ఘనత సాధించాడు. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో మ్యాచ్‌లో టీమిండియా 106 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను 1-1తో ముగించింది. బ్యాటింగ్‌లో టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, యశస్వి జైస్వాల్ రాణించగా, బౌలింగ్‌లో కుల్దీప్ యాదవ్ 5 వికెట్లు పడగొట్టి కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో కుల్దీప్ యాదవ్ 2.5 ఓవర్లు బౌలింగ్ చేసి 17 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో పాటు అంతర్జాతీయ టీ20లో రెండుసార్లు ఐదు వికెట్లు పడగొట్టిన ఘనత సాధించాడు. భారత్ తరపున అత్యధిక టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు తీసిన భువనేశ్వర్ కుమార్ రికార్డును సమం చేశాడు.వీరిద్దరితో పాటు యుజ్వేంద్ర చాహల్, దీపక్ చాహర్ కూడా భారత్ తరపున టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో ఐదు వికెట్లు పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో కుల్దీప్ డేవిడ్ మిల్లర్, డోనోవన్ ఫెరీరా, కేశవ్ మహరాజ్, నాండ్రే బెర్గర్, లిజాద్ విలియమ్స్ వికెట్లు తీశాడు.ముఖ్యంగా 29వ పుట్టినరోజున కుల్దీప్ ఐదు వికెట్లు తీయడం విశేషం. దీంతో తన పుట్టినరోజు నాడు 3 వికెట్లు తీసిన టీమిండియా మాజీ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ రికార్డును కుల్దీప్ బద్దలు కొట్టాడు. అతని పుట్టినరోజున అంటే డిసెంబర్ 12, 2009, మొహాలీలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో యువరాజ్ సింగ్ 23 పరుగులు చేసి మూడు వికెట్లు తీశాడు. ఇప్పటి వరకు ఇదే రికార్డుగా నిలిచింది. భారత్ తరపున ఇప్పటివరకు 34 టీ20 మ్యాచ్‌లు ఆడిన కుల్దీప్ 6.68 ఎకానమీతో 58 వికెట్లు పడగొట్టాడు.



# ధోనీకి అరుదైన గౌరవం

**ముంబై:** టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి అరుదైన గౌరవం లభించింది. ధోనీ ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. టీమిండియాకు ధోనీ అందించిన అరుదైన సేవలకు గుర్తింపుగా భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ) అరుదైన రీతిలో గౌరవించింది. ధోనీ ధరించిన జెర్సీ నెంబర్7కు కూడా బిసిసిఐ రిటైర్మెంట్ ప్రకటించింది. ధోనీ ధరించిన ఏడో నెంబర్ జెర్సీని ఎవరికీ కేటాయించకూడదని బిసిసిఐ నిర్ణయించినట్టు తెలిసింది. అయితే దీనిపై బోర్డు నుంచి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. అయితే ధోనీ చారిత్రక ప్రదర్శనను దృష్టిలో పెట్టుకుని అతని జెర్సీ ఇతర ఆటగాళ్లకు కేటాయించకూడదనే నిర్ణయానికి బిసిసిఐ వచ్చినట్టు సమాచారం. ఇప్పటి వరకు భారత క్రికెట్ చరిత్రలో దిగ్గజ ఆటగాడు సచిన్ టెండూల్కర్‌కు మాత్రమే ఇలాంటి అరుదైన గౌరవం లభించింది. సచిన్ ధరించిన జెర్సీ నంబర్10ను ఇతర ఆటగాళ్లకు కేటాయించకూడదని బిసిసిఐ నిర్ణయం తీసుకుంది. తాజాగా ధోనీకి ఇలాంటి గౌరవమే అందించాలని భారత క్రికెట్ బోర్డు భావిస్తున్నట్టు తెలిసింది.

# ముంబై కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా..

## మరి రోహిత్ పరిస్థితి ఏంటి?

ముంబై ఇండియన్స్ సంచలన నిర్ణయం తీసుకుంది. ముంబై ఇండియన్స్ ఐపిఎల్ 2024 సీజన్‌కు టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యను కెప్టెన్‌గా నియమించింది. ఇటీవల గుజరాత్ టైటాన్స్ నుంచి ట్రేడింగ్ ద్వారా తీసుకున్న ముంబై అతడికి వెంటనే కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ నిర్ణయంతో ప్రస్తుత కెప్టెన్ రోహిత్ శర్మ భవిష్యత్ ఏంటన్నది చర్చనీయాంశంగా మారింది. 2022లో గుజరాత్ టైటాన్స్‌కు ఐపిఎల్ కిరీటాన్ని అందించాడు హార్దిక్. కెప్టెన్‌గా తన అద్భుతమైన కెరీర్‌లో ఐదు ఐపిఎల్ ట్రోఫీలను అందించిన జట్టుకు రోహిత్ శర్మ ఇకపై నాయకత్వం వహించడన్న విషయం తెలుసుకున్న అతని ఫ్యాన్స్ ఫీలవుతున్నారు. ఇప్పటి వరకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్ రోహిత్. ఈ నిర్ణయంతో ముంబై ఇండియన్స్ భవిష్యత్తు కోసం జట్టును బలోపేతం చేయడంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యా ఐపీఎల్ 2024 సీజన్‌కు ముంబై ఇండియన్స్‌కు కెప్టెన్సీని స్వీకరిస్తాడు అని ముంబై ఇండియన్స్ గ్లోబల్ ఆఫ్ పెర్ఫార్మెన్స్ హెడ్ అయిన క్రిక్‌బజ్‌తో మహేల జయవర్ధనే అన్నారు.




PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com